ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

విజన్ ఆంధ్ర
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

శుక్రవారం 16 అక్టోబర్ 2026 | Friday 16 octobar 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 180 | Vol.No 28 Issue No .180 | www.visionandhra.in

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రజలంతా సహకరించాలి

- నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి..
- రైతులు యాసంగి పంటల సాగును తగ్గించుకోవాలి
- 20 వేల మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్..
- తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం
- బీఆర్‌ఎస్ పాలనలో సాగునీటి హక్కులకు నష్టం జరిగిందని సీఎం ఆరోపణ
- యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టుపై విచారణకు సిద్ధం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : ఎల్‌నినో ప్రభావంతో రానున్న 8 నుంచి 10 నెలల్లో రాష్ట్రంలో తీవ్ర ఎండలు, తాగునీటి కొరత, విద్యుత్ డిమాండ్ పెరుగుదల వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కొనేందుకు ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. అందుబాటులో ఉన్న మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించామని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 100 దేశాలు ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని,



వాతావరణ మార్పుల వల్ల భూమిపై ఉన్న జీవరాశు లన్నింటిపైనా ప్రభావం పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరించినట్లు సీఎం పేర్కొన్నారు. గతంలో కోవిడ్ సమయంలో మాదిరిగానే ఈ సంక్షోభాన్ని కూడా సమష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు.

***విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగింది***

అక్టోబర్‌లో సాధారణంగా ఉండాల్సిన ఉష్ణోగ్రతలకు బదులుగా మార్చి నెలలో నమోదయ్యే స్థాయిలో ఎండలు ఉంటున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్ల నుంచి 20 వేల మెగావాట్లకు పెరిగిందని, ఇటీవల ఒకే రోజు 20,003 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైందని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల పంపుసెట్లు పనిచేస్తుండటంతో విద్యుత్ అవసరం గణనీయంగా పెరిగిందన్నారు. గత 13 ఏళ్లలో సుమారు 14 వేల మెగావాట్ల

మిగతా 2లో..

# తెలంగాణలో టెండర్ల గోల్‌మాల్

## సీఎం ఆఫీస్ నుంచే బెదిరింపు కాల్స్!

- ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంచలన ఆరోపణలు!
- రూ. 700 కోట్లు మిగిలే చోట రూ. 1000 కోట్లు నష్టం పెట్టి ఆంధ్రా కంపెనీకి దోచిపెట్టారా?
- తెలంగాణ కాంట్రాక్టర్లు అంటే అంత చులకనా?
- రూ. 20 వేల కోట్లు బకాయి పెట్టి ఆత్మహత్యలకు పురిగొల్పుతున్న సర్కార్!

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 15,విజన్ ఆంధ్ర: తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్ట్, టెండర్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని, ప్రజాస్వామ్యంలో ఎన్నడూ లేని విధంగా టెండర్ ప్రక్రియలో పాల్గొనవద్దని ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయం నుండే తమకు నేరుగా బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ప్రముఖ నిర్మాణ సంస్థ ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం సంచలన నిజాలు బయటపెట్టింది. తెలంగాణ చరిత్రలో ఇలాంటి దుస్థితి ఎప్పుడూ చూడలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



రాజగోపాల్ రెడ్డి బాటలోనే మా ప్రయాణం – కానీ ఫలితం దారుణం!

"ఈ విషయాన్ని మొన్నటికి మొన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా బహిరంగ సభలోనే చెప్పారు. టెండర్

మిగతా 2లో..

# ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- తుది దశకు వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు
- ఈనెల 20వ తేదీ దసరా రోజు సాఫ్ట్ లాంచ్ ఓపి సేవలు ప్రారంభం

వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగ జిల్లా పాత సెంట్రల్ జైలు ప్రాంగణంలో నిర్మిస్తున్న 24 అంతస్తుల నూతన మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను పనులను సహచర మంత్రి ధనసరి అనసూయ సీతక్క గారు, ఎంపీలు వేం. నరేందర్ రెడ్డి గారు, బలరాం నాయక్ గారు,





ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య గారు, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి గారు, కే.ఎల్. నాగరాజు గారు, ఖఖణూ చైర్ పర్సన్ గుండు సుధారాణి గారితో పాటు వైద్య శాఖ ఉన్నతాధికారులు , జిల్లాల కలెక్టర్లు, వైద్యాధికారులు మరియు ఆర్ అండ్ బి అధికారులతో

మిగతా 2లో..

# ఫిబ్రవరి నాటికి ఎల్‌నినో ప్రభావం తీవ్ర స్థాయికి

- తెలంగాణ సీఎస్ సంజయ్ జాజు
- ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు పెరిగాయని సీఎస్ వెల్లడి
- పంటలకు రానున్న 15-20 రోజులు కీలకం
- భూగర్భ జలమట్టాలు పడిపోవడంపై ఆందోళన
- తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం
- ప్రతి జిల్లాకు నోడల్ అధికారులు
- సింగూరు, మంజీరా జలాశయాల నీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి

మిగతా 2లో..



# దసరా పండుగే టార్గెట్

- తెలంగాణలో మద్యం ఏరులై పారనుందా?
- రూ. 1,000 కోట్ల భారీ టార్గెట్ ఫిక్స్ చేసిన ఎక్సైజ్ శాఖ!
- బీర్ల కొరత రాకుండా నెల ముందే స్కెచ్
- మందుబాబులకు ఫుల్ స్టాక్ గ్యారెంటీ!

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 15,విజన్ ఆంధ్ర: దసరా పండుగను తెలంగాణ ఎక్సైజ్ శాఖ క్యాష్ చేసుకోబోతోంది. ఈ దసరా పండుగ సందర్భంగా రాష్ట్రంలో మద్యం విక్రయాల ద్వారా ఏకంగా రూ. 1,000 కోట్ల ఆదాయాన్ని రాబట్టాలని తెలంగాణ ఎక్సైజ్ శాఖ భారీ టార్గెట్‌ను నిర్ధారించుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.



మిగతా 2లో..

# సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా

## - రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు



- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- ప్రాజెక్టుల్లో సీఎంవో 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని విమర్శ
- ఓ నిర్మాణ సంస్థ ఎండీ రాసిన లేఖను విడుదల చేసిన కేటీఆర్
- ప్రజా సంక్షేమాన్ని వదిలి కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారని ఫైర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఏకంగా 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని, ఇది అవినీతి పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కేవలం సొంత ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు. తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న ఒక లేఖను కేటీఆర్ సోషల్ మీడియా

మిగతా 2లో..

# సింగరేణి ప్రైవేటీకరణపై మంత్రి కీలక ప్రకటన..

## సింగరేణిని ప్రైవేటీకరించబోమని శ్రీధర్‌బాబు స్పష్టీకరణ

- ప్రైవేటీకరణపై విపక్షాల ఆరోపణల్లో నిజం లేదని వెల్లడి
- గత బీఆర్‌ఎస్ పాలనపై మంత్రి తీవ్ర విమర్శలు
- సింగరేణికి భారీగా బకాయిలు పెట్టారని ఆరోపణ
- ఆధారాలు లేని విమర్శలను పట్టించుకోవద్దని కార్మికులకు సూచన

సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేశారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు గానీ, ప్రజలు గానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపించారు.

మిగతా 2లో..



# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. కీలక ప్రకటన చేసిన పీయూష్ గోయల్

భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంలో తొలి దశ పూర్తి
ప్రస్తుతం ఒప్పందం లీగల్ డ్రాఫ్టింగ్ దశలో ఉందన్న కేంద్ర మంత్రి
చర్చలు కొలిక్కి వస్తున్నాయన్న విదేశాంగ మంత్రి జైశంకర్
పోటీ దేశాలపై పైచేయి సాధించడమే లక్ష్యమంటున్న భారత్



భారత్–అమెరికా మధ్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందానికి

మిగతా 2లో..

# సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా.. ఇదే మా విధానం

- విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు
- గ్రామీణ మహిళల ఉత్పత్తుల కోసం 'స్వయం ఏపీ' బ్రాండ్ ఆవిష్కరణ
- మహిళలను సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- రాబోయే ఐదేళ్లలో మరో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తల తయారీకి ప్రణాళిక
- ప్రతి గ్రామాన్ని ఉపాధి కేంద్రంగా మార్చడమే ధ్యేయమని స్పష్టీకరణ

విజయవాడ : మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే





స్థాయికి ఎదగాలని, సంపద సృష్టికర్తలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, గ్రామీణ మహిళల నైపుణ్యాలకు, ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో వేదిక కల్పిస్తున్న జాతీయ సరస్ మేళా–2026ను విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. దసరా శరన్నవరాత్రుల వేళ ఇంద్రకీలాద్రి సాక్షిగా ఈ మేళా నిర్వహించడం నగరానికి మరింత శోభను తెచ్చిందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి, ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

మిగతా 2లో..

# ఎస్ఐఆర్‌పై రాహుల్ గాంధీ పిటిషన్.. ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు

- ఎస్ఐఆర్ పిటిషన్‌పై ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు
- ఎస్ఐఆర్‌ను తాత్కాలికంగా నిలిపివేయాలని పిటిషన్‌లో విజ్ఞప్తి
- అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థన
- నిరసన వేదికగా జంతర్ మంతర్ తొలగింపు పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు నోటీసులు
- సీసీటీవీ దృశ్యాలను భద్రపరచాలని ధర్మాసనం ఆదేశం

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భారీగా ఓట్ల తొలగింపు, అక్రమాలు జరిగాయంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నేడు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఎస్ఐఆర్ వ్యవహారంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతలు ఇటీవల సుప్రీంకోర్టుకు ర్యాలీగా

మిగతా 2లో..



# సీఎంవోలో 15 శాతం కమిషన్ దందా

వేదికగా విడుదల చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) రేడియల్ రోడ్-2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. సుశీ ఇన్‌ఫ్రా వంటి అర్హత కలిగిన సంస్థలను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముడుపులు చెల్లించిన తర్వాతే బిల్లులు విడుదల చేస్తున్నారని, ఈ కమీషన్ దందా వల్లే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, కేవలం వ్యక్తిగత లాభం, దోపిడీపైనే దృష్టి సారించిందని మండిపడ్డారు.

# సింగరేణి ప్రైవేటీకరణపై మంత్రి కీలక ప్రకటన..

బీఆర్ఎస్ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు పెట్టి ఆర్థికంగా దెబ్బతీశారని విమర్శించారు. అప్పట్లో సంస్థను నిర్వీర్యం చేసిన నాయకులు, ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. సింగరేణి సంస్థ ప్రతిష్టను దెబ్బతీయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఆధారాలు లేని విమర్శలను ప్రజలు, కార్మికులు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. కీలక ప్రకటన చేసిన పీయూష్ గోయల్

సంబంధించి కీలక పురోగతి లభించింది. ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత ట్రేడ్ డీల్‌లో మొదటి దశ ఖరారైందని, ప్రస్తుతం ఇది న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్టింగ్) దశలో ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను పంచుకున్నారు. "అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన తొలి విడత చర్చలు ఫలప్రదమయ్యాయి. ప్రస్తుతం దీనికి తుది మెరుగులు దిద్దుతున్నాం. చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత, మన పోటీ దేశాలతో పోలిస్తే భారత్‌కు స్పష్టమైన ప్రయోజనాలు చేకూరేలా ఈ ఒప్పందాన్ని అమలు చేస్తాం" అని పీయూష్ గోయల్ వివరించారు. ఇదే విషయంపై వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ స్పందిస్తూ, చర్చలు సానుకూల దిశలో సాగుతున్నాయని, వీలైనంత త్వరగా ఒప్పందం కొలిక్కి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అమెరికాతో టారిఫ్ విధానంపై మరింత స్పష్టత వచ్చిన తర్వాత ఈ ప్రక్రియ వేగవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు.విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సైతం ఈ ఒప్పందంపై ఆశాభావం వ్యక్తం చేశారు. చర్చలు తుది దశకు (ల్యాండింగ్ పాయింట్) చేరుకుంటున్నాయని, ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఎలాంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌కు దక్కే అదనపు ప్రయోజనాలే కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.అయితే, అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) జేమిసన్ గ్రీర్ ఇటీవల మాట్లాడుతూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ఇరు దేశాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నప్పటికీ, ఇది వెంటనే కార్యరూపం దాల్చే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. ఇంకా పరిష్కారం కాని కొన్ని అంశాలపై ఇరు దేశాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.టారిఫ్ సమస్యలు, ఇతర అడ్డంకులను తొలగించి, ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతో 2025 ప్రారంభం నుంచి భారత్, అమెరికా మధ్య ఈ చర్చలు సాగుతున్నాయి. గతంలో అమెరికా విధించిన సుంకాలు, హెచ్1బీ వీసా ఫీజుల పెంపు, గ్రీన్ కార్డ్ ప్రాసెసింగ్‌పై ఆంక్షల వంటి పరిణామాలు ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం చూపిన నేపథ్యంలో, తాజా పరిణామం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# దసరా పండుగే టార్గెట్

*గతేడాది నష్టం - ఈసారి పక్కా ప్లాన్!*

గత సంవత్సరం దసరా పండుగ రోజునే గాంధీ జయంతి రావడంతో డ్రై డే ప్రకటించాల్సి వచ్చింది. దీంతో ఆశించిన స్థాయిలో మద్యం అమ్మకాలు జరగలేదు, ఎక్సైజ్ ఆదాయానికి భారీ గండి పడింది. ఆ నష్టాన్ని ఈసారి పూడ్చుకోవాలని ప్రభుత్వం డిసైడ్ అయింది. ఈసారి దసరా పండుగ మంగళవారం నుంచే మొదలవుతుండటంతో, ఆదివారం నుంచే మద్యం విక్రయాలు అమాంతం పెరుగుతాయని ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తోంది. వారం రోజుల పాటు మద్యం ఏరులై పారుతుందని అధికారులు లెక్కలు వేసుకుంటున్నారు.

*బీర్ల ఉత్పత్తికి బ్రేక్ లేదు - నెల ముందే జాగ్రత్తలు!*

ప్రతి పండుగ సీజన్‌లో బీర్ల కొరత తీవ్రంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి తెలంగాణ ప్రభుత్వం నెల రోజుల ముందే అన్ని జాగ్రత్తలు తీసుకుంది. బీర్ల ఉత్పత్తి ఏమాత్రం తగ్గకుండా, సరఫరాలో ఎలాంటి అంతరాయం రాకుండా బ్రూవరీలకు ఇప్పటి నుండే ఆదేశాలు జారీ చేసింది. అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉండేలా, ఎక్కడా స్టాక్ ఔట్ అవ్వకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. దసరా సెలబ్రేషన్స్‌లో మద్యం విక్రయాలు ఈసారి రికార్డు స్థాయిలో ఉండబోతున్నాయని, ఆదాయం రూ. 1,000 కోట్ల మార్క్‌ను సులభంగా దాటుతుందని ఎక్సైజ్ శాఖ ధీమా వ్యక్తం చేస్తోంది.

# ఫిబ్రవరి నాటికి ఎల్‌నినో ప్రభావం తీవ్ర స్థాయికి

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ప్రస్తుతం తీవ్రంగా ఉందని, 2027 ఫిబ్రవరి నాటికి అది గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలపై గణనీయమైన ప్రభావం పడిందని, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగాయని చెప్పారు. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు జలాశయాన్ని గురువారం సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తాగునీటి లభ్యత, సాగులో ఉన్న పంటల పరిస్థితిని అంచనా వేయడానికి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుత పరిస్థితులపై గురువారం సాయంత్రం జరిగే మంత్రివర్గ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు. రానున్న 15 నుంచి 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని సీఎస్ పేర్కొన్నారు. పంటలను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడంతో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నీరు అందుబాటులో ఉండకపోవచ్చని తెలిపారు. అందువల్ల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లాకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వ్యవసాయ అవసరాలకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని సీఎస్ సూచించారు. హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా రూపొందించిన ప్రణాళికలను సమర్థంగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రాబోయే 15 రోజుల నీటి లభ్యతను అంచనా వేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాతావరణ మార్పులు పంటలపై చూపే ప్రభావాన్ని వ్యవసాయ, విద్యుత్, సాగునీటి శాఖలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయిలో రైతులు, స్థానిక ప్రజలను కలిసి వారి అవసరాలను తెలుసుకోవాలని, ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

# సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా.. ఇదే మా విధానం

*గ్రామాలే ఉపాధి కేంద్రాలుగా..*

రాష్ట్రంలో 1.10 కోట్ల మంది సభ్యులతో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా) ఉన్నాయని, ఇవి ఏటా రూ.69 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చంద్రబాబు వివరించారు. నిన్నటి పొదుపు సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా రూపాంతరం చెందుతున్నాయని, భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని, ఇది కేవలం ప్రదర్శన కాదని, గ్రామీణ ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా తొలి అడుగని పేర్కొన్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ, కొత్త వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని మహిళలకు సూచించారు.

*సాంకేతికతతో ప్రపంచ మార్కెట్‌కు..*

'స్వయం ఏపీ' బ్రాండ్ ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేస్తామని చంద్రబాబు తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు. మహిళల భద్రత, ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూనే, వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఒక ఉపాధి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రజలంతా సహకరించాలి

మేర విద్యుత్ డిమాండ్ పెరగగా, గత రెండేళ్లలోనే 6 నుంచి 7 వేల మెగావాట్ల అదనపు డిమాండ్ ఏర్పడిందని వివరించారు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, విద్యుత్ శాఖ మంత్రి, అధికారులు, సిబ్బందిని అభినందించారు. వానాకాలం పంటలు మరో 20 రోజుల్లో కోతకు వచ్చే అవకాశం ఉన్నందున పంటలు చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మార్కెట్‌లో ఎంత ధరకు విద్యుత్ లభించినా కొనుగోలు చేసి రైతులకు సరఫరా చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండటంతో ఓవర్‌లోడ్ కారణంగా కొన్ని ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయాలు ఏర్పడుతున్నాయని, సమస్యను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

*తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి*

రాష్ట్రంలో వర్షపాతం లోటు సుమారు 23 శాతంగా ఉందని, కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వలు 72 శాతం, గోదావరి బేసిన్‌లో 40 శాతం మేర తక్కువగా ఉన్నాయని సీఎం వివరించారు. సాధారణ పరిస్థితుల్లో సుమారు 460 టీఎంసీల నీరు అవసరమయ్యే పరిస్థితుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి నిల్వలు సుమారు 209 టీఎంసీలేనని తెలిపారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో సాగునీరు, తాగునీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని సుమారు 24 వేల గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉందని, ఈ పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బండ్లు, కార్లు కడగడం వంటి అవసరాలకు నీటిని వృథా చేయవద్దని, ప్రతి చుక్కను పొదుపు చేయాలని సూచించారు. నీటిని కొనుగోలు చేయగలిగినా, నీటి కొరత ఏర్పడినప్పుడు దాన్ని సులభంగా సమకూర్చుకోలేమని పేర్కొన్నారు.

*యాసంగి సాగును తగ్గించుకోవాలి*

తెలంగాణలో వరి సాగు చేసే రైతుల సంఖ్య ఎక్కువగా ఉందని, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో సుమారు 13 లక్షల ఎకరాల్లో వరి కాకుండా ఇతర పంటలు, 56 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు తెలిపారు. వానాకాలంలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని గతంలోనే రైతులకు సూచించినట్లు చెప్పారు. వచ్చే యాసంగి సీజన్‌లో వరి సాగును తగ్గించుకోవాలని, అందుబాటులో ఉన్న నీటిని పరిగణనలోకి తీసుకుని పంటలు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మి వరి సాగు చేపడితే నారుమళ్ల దశలోనే నీటి కొరత ఏర్పడి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటితో సాగు అవసరాలను పూర్తిస్థాయిలో తీర్చడం కష్టమని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. పంటలు సాగు చేయలేని పరిస్థితుల్లో రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టే కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో సుమారు 25 వేల మంది ఉపాధి హామీ పనుల్లో పాల్గొనగా, ప్రస్తుతం రెండున్నర లక్షల మంది పనులు చేస్తున్నారని వెల్లడించారు. చెరువులు, కుంటల మరమ్మతులకు ఉపాధి హామీ పనుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు.

*పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి*

వానాకాలంలో పంట నష్టపోయిన రైతులతో పాటు, నీటి కొరత కారణంగా వచ్చే సీజన్‌లో పంటలు సాగు చేయలేని రైతులను కూడా ఆదుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూర్చే పథకాల ద్వారా రైతులకు సహాయం అందించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన ఆర్థిక సహాయం పొందేందుకు నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. సుమారు 10 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని నివేదికలు అందినట్లు పేర్కొంటూ, పంటలు ఎండిపోకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం అందించడం కూడా అత్యంత ముఖ్యమని, వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వాతావరణ మార్పుల వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలపై వైద్యారోగ్య శాఖను అప్రమత్తం చేశామని, పేదలకు ఏ కష్టం వచ్చినా తక్షణమే సహాయం అందించేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు.

*అన్ని పార్టీలు, ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలి*

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడంలో రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సీఎం పిలుపునిచ్చారు. కోవిడ్ సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపునకు అనుగుణంగా రాష్ట్రం సహకరించిందని, ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో అన్ని పార్టీలు, ప్రజలు ప్రభుత్వ సూచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. మీడియా సహకారం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధుల కోసం ప్రభుత్వం తరఫున నోడల్ అధికారిని నియమించి, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కళాజాతాలు నిర్వహిస్తామని, సీనియర్ జర్నలిస్టులు, నిపుణులు ఎల్‌నినో ప్రభావం, నీటి పొదుపు, విద్యుత్ వినియోగంపై వ్యాసాలు రాయాలని కోరారు. సినీ నటులు, క్రీడాకారులు, కళాకారుల సహకారంతో ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. నటుడు విజయ్ దేవరకొండ ఇప్పటికే ఎల్‌నినోపై ప్రజలకు విజ్ఞప్తి చేసినట్లు ప్రస్తావించారు. దసరా తర్వాత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరిస్తామని, అనంతరం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర హోంశాఖ మంత్రి, ఇతర కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి అవసరమైన సహాయం కోరుతామని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి అధికంగా ఉన్న రాష్ట్రాల నుంచి విద్యుత్‌ను సమీకరించి, అవసరమైన రాష్ట్రాలకు తక్కువ ధరకు అందించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే విషయంలో తమకు పూర్తి విశ్వాసం ఉందని, ప్రభుత్వం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని పేర్కొన్నారు.

*కరువుకు కాంగ్రెస్ కారణమంటూ బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలపై స్పందన*

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమంటూ బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను ముఖ్యమంత్రి ఖండించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌తో పాటు బ్రిటన్, జపాన్ వంటి దేశాల్లోనూ ఎల్‌నినో ప్రభావం ఉంటుందని, అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వాలు లేనప్పటికీ ఇలాంటి వాతావరణ సమస్యలు ఎందుకు తలెత్తుతున్నాయని ప్రశ్నించారు. ప్రభుత్వంపై బురదజల్లేందుకు బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నీటి సమస్యపై చర్చించాలంటే గత ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్ణయాలు, సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై కూడా చర్చ జరగాలని అన్నారు. కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో ఎప్పుడైనా చర్చకు సిద్ధమని ప్రకటించారు.

*కృష్ణా జలాల విషయంలో బీఆర్ఎస్‌పై ఆరోపణలు*

2015లో కృష్ణా జలాల పంపిణీ విషయంలో తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 515 టీఎంసీలు కేటాయించే అంశానికి సంబంధించి ఎవరు అంగీకారం తెలిపారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ నీటి హక్కులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నష్టం జరిగిందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఎస్ఎల్‌బీసీ, డిండి, సీతారామసాగర్ వంటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులపై గత ప్రభుత్వం సుమారు రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పిందని, అయితే రూ.40 వేల కోట్ల బకాయిలు మిగిల్చిందని విమర్శించారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు జరిగిన నష్టంపై బహిరంగ చర్చకు సిద్ధమని, గత ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని అన్నారు. గోదావరి జలాల విషయంలోనూ చర్చకు రావాలని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. మేడిగడ్డ బ్యారేజీపై నిపుణులు చేసిన సూచనలు, గోదావరి నదిపై ప్రాజెక్టుల నిర్మాణం వంటి అంశాలపై కూడా చర్చ జరగాలని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పనులను విమర్శించడం కంటే గతంలో జరిగిన నిర్ణయాలపై సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ నాయకులను కోరారు.

*కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి సరఫరాపై విచారణకు సిద్ధం*

కొండపోచమ్మ నుంచి పంచపాండవుల చెరువుకు కాలువ తవ్వి, అక్కడి నుంచి కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోని సుమారు 400 ఎకరాలకు నీటిని సరఫరా చేస్తున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఈ వ్యవహారంపై నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేద్దామని ప్రతిపాదించారు. పంచపాండవుల చెరువు నుంచి నీరు ఎక్కడికి వెళ్తోంది, ఎవరి పొలాలకు సరఫరా అవుతోంది అనే అంశాలపై విచారణ జరగాలని అన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ప్రత్యేకంగా నీటి సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నిస్తూ, దీనిపై వాస్తవాలు వెలుగులోకి రావాలని పేర్కొన్నారు.

*యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టు వ్యయంపై ప్రశ్నలు*

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం, బొగ్గు కొనుగోలు ఒప్పందాలపై ముఖ్యమంత్రి పలు ఆరోపణలు చేశారు. విద్యుత్ కొరతను ముందుగానే అంచనా వేసినట్లు చెప్పిన గత ప్రభుత్వం 1,040 మెగావాట్ల భద్రాద్రి, 4,000 మెగావాట్ల యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. యాదాద్రి ప్రాజెక్టు నిర్మాణానికి బీహెచ్ఈఎల్‌తో తొలుత సుమారు రూ.17,950 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నారని, అనంతరం అంచనా వ్యయం రూ.37,781 కోట్లకు పెరిగిందని సీఎం తెలిపారు. ఈ వ్యయ పెరుగుదలకు ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్మాణం, బొగ్గు కొనుగోలు ఒప్పందాలపై సమగ్ర విచారణ జరగాలని అన్నారు. యాదాద్రి ప్రాజెక్టులో ఉత్పత్తి అయ్యే విద్యుత్ యూనిట్‌కు సుమారు రూ.6.60 ఖర్చవుతుండగా, మణుగూరులో రూ.4.62, కొత్తగూడెంలో రూ.3.94, సింగరేణి 1, 2 ప్రాజెక్టుల్లో రూ.4.05 వ్యయం అవుతోందని వివరించారు. ఇతర ప్రాజెక్టులతో పోలిస్తే యాదాద్రిలో యూనిట్‌కు అదనపు వ్యయం అవుతోందని, దీని వల్ల భవిష్యత్తులో రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. తన అంచనా ప్రకారం యాదాద్రి ప్రాజెక్టు వల్ల అదనంగా సుమారు రూ.50 వేల కోట్ల భారం పడవచ్చని, వచ్చే 25 ఏళ్లలో నష్టం లక్ష కోట్లకు చేరవచ్చని సీఎం వ్యాఖ్యానించారు. ఈ అంచనాలపై సంబంధిత అధికారులు, నిపుణుల నివేదికల ఆధారంగా స్పష్టత రావాల్సి ఉంది.

*దిగుమతి బొగ్గు ఒప్పందాలపై విచారణకు సిద్ధం*

యాదాద్రి ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గు సరఫరా విషయంలో గత ప్రభుత్వం విదేశీ బొగ్గుపై ఆధారపడేలా ఒప్పందాలు చేసుకుందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2016లో యాదాద్రి ప్రాజెక్టుకు అవసరమైన 14 మిలియన్ టన్నుల బొగ్గులో ఏడు మిలియన్ టన్నుల దిగుమతి బొగ్గును సమకూర్చుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. సింగరేణి ప్రాంతంలో బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ యాదాద్రి ప్రాజెక్టును దామరచర్లలో నిర్మించారని, బొగ్గు రవాణా, ఉత్పత్తి వ్యయాలను పరిగణనలోకి తీసుకుంటే ప్రాజెక్టును బొగ్గు వనరులకు దగ్గరగా నిర్మించడం ప్రయోజనకరంగా ఉండేదని అభిప్రాయపడ్డారు. సింగరేణిలో లభించే బొగ్గును యాదాద్రి ప్రాజెక్టులో వినియోగించేలా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ఇందుకోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో మాట్లాడినట్లు తెలిపారు. నైనీ కోల్ నుంచి బొగ్గును తరలించి యాదాద్రి ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించామని, దేశీయ బొగ్గు వినియోగానికి ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. దిగుమతి బొగ్గు ఒప్పందాలపై విచారణ కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ రాసిన విషయాన్ని ప్రస్తావించిన సీఎం, ఏ విచారణకైనా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఒప్పందాలు, టెండర్లు, ప్రాజెక్టు వ్యయాలపై వాస్తవాలు వెలుగులోకి రావాలని అన్నారు. సింగరేణి బొగ్గు వినియోగానికి సంబంధించిన టెండర్లు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో జరిగిన న్యాయపరమైన పరిణామాలపై కూడా సీఎం వివరించారు. 2024లో ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం సింగరేణి బొగ్గును వినియోగించాలనే నిర్ణయంతో సంబంధిత స్టేను తొలగించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. యాదాద్రి ప్రాజెక్టులో ఐదో యూనిట్ పనులు ఇంకా పూర్తికావాల్సి ఉందని పేర్కొన్నారు.

*అవినీతి ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధం*

గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం, బొగ్గు కొనుగోలు ఒప్పందాలు, సాగునీటి ప్రాజెక్టుల వ్యయాలపై అనేక ప్రశ్నలు ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు. వీటిపై విచారణ జరిపి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని పేర్కొన్నారు. తన ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపాలని, తాము లేవనెత్తుతున్న అంశాలపై కూడా సమాధానాలు ఇవ్వాలని అన్నారు. అవినీతి ఆరోపణలపై ఎప్పుడైనా చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఎల్‌నినో ప్రభావం, నీటి కొరత, విద్యుత్ డిమాండ్ వంటి సమస్యలను రాజకీయాలకు అతీతంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రైతులు, ప్రజలు నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తూ ప్రభుత్వానికి సహకరించాలని, కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రానికి అవసరమైన సహాయం అందించాలని కోరారు.

# తెలంగాణలో టెండర్ల గోల్‌మాల్

వేయొద్దని సీఎం ఆఫీస్ నుంచి తనకు బెదిరింపులు వచ్చాయని, అయినా తాను భయపడకుండా టెండర్ వేశానని ఆయన ధైర్యంగా చెప్పారు. నిజంగా ఆయన ధైర్యాన్ని మెచ్చుకోవాలి.ఒకవేళ ఆ టెండర్‌ను రాజగోపాల్ రెడ్డి గారికి ఇచ్చి ఉంటే ప్రభుత్వ ఖజానాకు ఏకంగా రూ. 700 కోట్ల రూపాయలు మిగిలేవి. ఇది ప్రజల సొమ్ము. కానీ, ప్రభుత్వం కావాలనే, ఉద్దేశపూర్వకంగానే దాదాపు రూ. 1,000 కోట్ల రూపాయల భారీ నష్టాన్ని ప్రజలపై రుద్ది, ఆ టెండర్‌ను ఒక ఆంధ్రా కంపెనీకి కట్టబెట్టింది. ప్రజల సొమ్మును ఇలా దోచిపెట్టడం వెనుక మతలబు ఏంటి? ఎవరి కోసం ఈ త్యాగం? ఇందులో ఎంత కమీషన్ ముట్టిందో ప్రభుత్వమే చెప్పాలి!" అని ఆర్‌వీఎం యాజమాన్యం నిలదీసింది.

తెలంగాణ కాంట్రాక్టర్ల బతుకులు రోడ్డున – ఆత్మహత్యలే శరణ్యం!

"ఒకప్పుడు హైదరాబాద్ కాంట్రాక్టర్లు అంటే దేశమంతా గర్వంగా చూసేది. తెలంగాణ కాంట్రాక్టర్లు అంటే నాణ్యతకు, విశ్వసనీయతకు మారుపేరు. దేశవ్యాప్తంగా ఎక్కడ పెద్ద ప్రాజెక్టు జరిగినా మన తెలంగాణ బిడ్డలే ముందుండేవారు. కానీ, ఈ రోజు ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన దుస్థితి ఏంటంటే, రూ. 20,000 కోట్ల బకాయిలు పెట్టి, మమ్మల్ని రోడ్డున పడేసింది. బ్యాంకు లోన్లు కట్టలేక, కార్మికులకు జీతాలు ఇవ్వలేక చాలా మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకునే దయనీయ పరిస్థితికి వచ్చారు. బకాయిలు చెల్లించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లేఖల మీద లేఖలు రాసినా, కలిసి మొరపెట్టుకున్నా కనీస స్పందన కూడా లేదు. మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేడు" అని కన్నీటి పర్యంతమయ్యారు.

*కమీషన్లు ఇస్తేనే బిల్లులు – తెలంగాణలో కొత్త ఆనవాయితీ!*

"ఇప్పుడు తెలంగాణలో ఒక కొత్త సంస్కృతి మొదలైంది – కమీషన్ సంస్కృతి. ఇది ఒక ఆనవాయితీ అయిపోయింది. ఎవరైతే రాజకీయ పలుకుబడి కలిగి ఉంటారో, ఎవరైతే ముందుగా కమీషన్లు ఇస్తారో వారికే బిల్లులు చెల్లిస్తున్నారు. నిజాయితీగా పని చేసే మాలాంటి వారి బతుకులు అగమ్యగోచరంగా మారాయి. ఇదే పరిస్థితి ఇంకొన్ని రోజులు కొనసాగితే తెలంగాణలో ఒక్క కాంట్రాక్టర్ కూడా మిగలడు. అందరూ తెలంగాణ వదిలి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిపోయే పరిస్థితి వస్తుంది. అప్పుడు తెలంగాణ అభివృద్ధి ఎవరు చేస్తారు?" అని ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించింది..

# ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం



కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా సుదీర్ఘంగా ఆసుపత్రి ప్రాంగణమంతా కలియతిరుగుతూ నిర్మాణ పనుల పురోగతిని సమగ్రంగా పరిశీలించి, వైద్య విభాగాలు, రోగులకు అందించనున్న సదుపాయాలు, చికిత్సకు అవసరమైన మౌలిక వసతులు అంశాలను సంబంధిత అధికారులు, వైద్యులను అడిగి తెలుసుకోవడం జరిగింది. అదేవిధంగా అధికారులతో ఆసుపత్రి ప్రారంభోత్సవానికి సంబంధించిన విషయాలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. గత ప్రభుత్వం నిర్మించి తలపెట్టి అసంపూర్తిగా వదిలేసిన ఈ ఆసుపత్రిని ప్రజాప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని, నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేయించడం జరిగింది. నిరంతర పర్యవేక్షణ వలన పనులు కూడా తుదిదశకు చేరుకున్నాయి. నిర్మాణ పనులు తుది దశకు చేరుకుని చిన్న చిన్న పనులు మినహా సేవలకు సిద్దంగా ఉన్నఈ ఆసుపత్రిని ఈ అక్టోబర్ 20 తేది అంటే దసరా రోజున సాఫ్ట్ లాంచ్ ద్వారా ఓపి సేవలను ప్రారంభించబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది.దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. మళ్లీ ఒకసారి ఈనెల 17వ తేదీన పనులను పరిశీలిస్తాం. గత ప్రభుత్వం కేవలం కాగితాల మీదనే ఆర్డర్ల ఇచ్చి వైద్యాన్ని పూర్తి నిర్లక్ష్యం చేసింది. ప్రజా ప్రభుత్వం వచ్చాక ఎలాంటి బేషజాలకు పోకుండా ప్రజలకు ఉపయోగపడే ప్రతి కార్యక్రమాన్ని పూర్తి చేసుకుంటూ పోతుంది. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే సుమారు 5000 వరకు వచ్చే ఉండే అవకాశం ఉంది. వరంగల్ పట్టణ ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలకు రాబోయే రోజుల్లో ఈ ఎంజీఎం ఆసుపత్రి ద్వారా అత్యంత అధునాతనమైన కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుందని విశ్వాసిస్తున్నాను. డిసెంబర్ నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని ఆశిస్తున్నాం. ప్రజల నమ్మకం మరింత బలపడే విధంగా అందుకు అనుగుణంగానే ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తూ వైద్యానికి ప్రజా పెద్దపీట వేస్తుంది.

# ఎస్ఐఆర్‌పై రాహుల్ గాంధీ పిటిషన్.. ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు

వెల్లి ఉమ్మడి పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగిన ఓట్ల తొలగింపులు, మార్పులపై స్వతంత్రంగా ఆడిట్ నిర్వహించాలని ప్రతిపక్ష నేతలు కోరారు. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో సాంకేతిక నిపుణులు, ప్రముఖ పౌరులతో కూడిన స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఓటరునైనా ముందస్తు నోటీసు ఇవ్వకుండా, తన వాదన వినిపించే అవకాశం కల్పించకుండా ఓటర్ల జాబితా నుంచి తొలగించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పంజాబ్‌తో పాటు ఎన్నికలు జరగనున్న ఇతర రాష్ట్రాల్లో అర్హులైన ఓటర్లు చట్టం అనుమతించిన చివరి తేదీ వరకు తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. పిటిషన్‌పై తుది నిర్ణయం వెలువడే వరకు దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కూడా అభ్యర్థించారు.

రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ ప్రసాద్ యాదవ్, సౌగతా రాయ్, సుప్రియా సూలే, సంజయ్ రౌత్, డి.రాజా తదితరులు ఈ పిటిషన్‌లో సహ పిటిషనర్లుగా ఉన్నారు. మరోవైపు, జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశంగా గుర్తించిన హోదాను తొలగించడాన్ని సవాలు చేస్తూ స్వాతి సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ప్రాంగణంతో పాటు సంబంధిత ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను భద్రపరచాలని ఆదేశించింది. అక్టోబర్ 10న ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల నేపథ్యంలో నిరసనలు, మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రాకపోకలకు అంతరాయాలపై దాఖలైన ఇతర పిటిషన్లను కూడా ధర్మాసనం విచారించింది.

# సంపాదకీయం

## భారత్‌లో స్టార్‌లింక్ వివాదం

భారత్‌లో స్టార్‌లింక్ ఎంట్రీపై ఎలాన్ మస్క్ వ్యాఖ్యల కలకలం రేపుతున్నాయి. అంబానీపై విమర్శలు స్పెక్ట్రమ్ కేటాయింపులు, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి స్పందనలతో వివాదం ప్రారంభమయింది. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, భారత పారిశ్రామిక దిగ్గజం ముఖేష్ అంబానీల మధ్య నడుస్తున్న వాణిజ్య పోరు సరికొత్త రాజకీయ, సామాజిక రచ్చకు దారితీసింది. భారత ప్రజలపై తమ ఏకఛత్రాధిపత్యాన్ని కాపాడుకోవడానికి కొందరు ఒలిగార్క్‌లు స్టార్‌లింక్‌ను అడ్డుకుంటున్నారు.. భారత్‌కు నిజమైన బాస్ అంబానీయేనా? అంటూ ఎలాన్ మస్క్ ఎక్స్ వేదికగా విరుచుకుపడటంతో ఈ అంశం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే, ఈ ఆరోపణలు కేవలం ఒక వ్యాపార పోటీకి ప్రతిరూపమా లేక దేశీయ నియంత్రణలు, భద్రతా ప్రమాణాలకు సంబంధించిన అంశమా అన్నది లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.స్టార్‌లింక్ అనేది ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ రూపొందించిన లో-ఎర్త్ ఆర్బిట్ ఉపగ్రహ నెట్‌వర్క్. సాంప్రదాయ ఫైబర్ లేదా సెల్ టవర్ల అవసరం లేకుండా, అంతరిక్షంలో ఉన్న వేలాది చిన్న ఉపగ్రహాల ద్వారా నేరుగా భూమిపై ఉన్న డిష్, రిసీవర్లకు హై-స్పీడ్ శాటిలైట్ ఇంటర్నెట్‌ను ఇది అందిస్తుంది. భౌగోళికంగా చేరుకోలేని కొండ ప్రాంతాలు, అడవులు , మారుమూల గ్రామాలకు ఇది ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తుంది. భారత్‌లో ప్రవేశించేందుకు స్టార్‌లింక్ గత ఐదేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, వ్యాపార నిబంధనలు , స్పెక్ట్రమ్ కేటాయింపు పద్ధతులపై దేశీయ టెలికాం కంపెనీలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌తో ప్రధాన విభేదాలు తలెత్తాయి.అసలు వివాదానికి ప్రధాన మూలం స్పెక్ట్రమ్ కేటాయింపు విధానం . అంతర్జాతీయ నిబంధనల ప్రకారం శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను వేలం వేయకుండా పరిపాలనా ప్రాతిపదికన కేటాయించాలని మస్క్ వాదిస్తుండగా, దేశీయ స్పెక్ట్రమ్‌ను వేలం ద్వారా మాత్రమే కేటాయించాలని, అప్పుడే లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ఉంటుందని అంబానీ నేతృత్వంలోని జియో పట్టుబట్టింది. దీనికితోడు జాతీయ భద్రత, డేటా లోకలైజేషన్ అంశాలు ప్రధాన అవరోధాలుగా మారాయి. భారతీయుల డేటా దేశీయ సర్వర్లలోనే భద్రంగా ఉండాలని, భద్రతా ఏజెన్సీలు నిఘా పెట్టేలా శాటిలైట్ గేట్‌వేలను ఏర్పాటు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. మస్క్ ఆరోపణలను కేంద్ర నివేదికలు తీవ్రంగా ఖండించాయి. టెలికాం నియంత్రణలన్నీ పారదర్శకంగా, వివక్ష రహితంగా ఉన్నాయని, స్టార్‌లింక్‌తో పాటు ఇతర మూడు సంస్థలు కూడా ఒకే భద్రతా తనిఖీల దశలో ఉన్నాయని కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.ఈ వ్యాపార పోరు కాస్త రాజకీయ రంగు పులుముకుంది. మస్క్ వ్యాఖ్యలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. వెల్‌కమ్ టూ ఇండియా ఎలాన్.. అసలు వ్యక్తి ఎవరో తెలిసే వరకు వేచి చూడండి అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. దీనికి మస్క్ థాంక్యూ రాహుల్, ఇది నిజంగా ఆందోళనకరం అని బదులిచ్చారు. ఇక తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ వివాదంపై స్పందిస్తూ, వినూత్న శాటిలైట్ ఇంటర్నెట్ సాంకేతికతను భారత్ ఆహ్వానించాలని, కొందరి పారిశ్రామిక ప్రయోజనాల కోసం అంతర్జాతీయంగా బ్రాండ్ ఇండియా ను బలహీనపరచకూడదని పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు దీనిని కేంద్ర ప్రభుత్వం, కార్పొరేట్ దిగ్గజాల బంధానికి నిదర్శనంగా విమర్శించగా, బిఆర్ఎస్, బిజెపి వర్గాలు భద్రతా నియంత్రణలను పక్కనబెట్టి విదేశీ సంస్థలకు కార్పెట్ పరిచే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి. ఈ మొత్తం వివాదంపై ముఖేష్ అంబానీ, రిలయన్స్ జియో వర్గాలు ఇప్పటివరకు ప్రత్యక్షంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అయితే, జియో కూడా స్వయంగా అంతరిక్ష ఉపగ్రహ ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను సొంతంగా అభివృద్ధి చేసేందుకు బిలియన్ డాలర్ల ప్రణాళికలతో సిద్ధమవుతోంది. కాబట్టి, విదేశీ దిగ్గజమైన స్టార్‌లింక్ భారత్‌లోకి ముందే అడుగుపెడితే దేశీయ టెలికాం పరిశ్రమకు, ముఖ్యంగా 5ఉ వ్యాపారానికి గట్టి పోటీ ఎదురవుతుందనేది బహిరంగ రహస్యమే.నిబంధనలు తీరి స్టార్‌లింక్ భారత మార్కెట్లోకి వస్తే మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్ విప్లవం రావడం ఖాయం. అయితే డివైజ్ ధరలు, ప్లాన్ చార్జీలు సామాన్యుడికి అందుబాటులో ఉంటాయా లేదా అన్నది ప్రశ్నార్థకమే. ఎలాన్ మస్క్ చేసిన ఆరోపణలు కేవలం ఏకపక్ష వ్యాపార కోపంతో కూడుకున్నవా లేక విదేశీ పెట్టుబడులకు భారత నిబంధనలు కఠినంగా మారుతున్నాయా అనే దానిపై విస్తృత విశ్లేషణలు నడుస్తున్నాయి. జాతీయ భద్రత , డేటా రక్షణ విషయంలో రాజీ పడకుండానే, దేశీయ , అంతర్జాతీయ సంస్థలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా భారత టెలికాం రంగాన్ని ఆరోగ్యకరమైన పోటీ వైపు నడిపించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉ ఒదన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది. టెక్ దిగ్గజం, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని టార్గెట్ చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. "భారత ప్రధాన మంత్రి అంబానీ గారూ.." అంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్టులు దుమారం రేపుతున్నాయి. భారత్‌లో తన స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు అనుమతులు లభించడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై అసహనం వ్యక్తం చేశారు. దేశీయ టెలికాం రంగాన్ని శాసిస్తున్న ముకేశ్ అంబానీ ప్రయోజనాల కోసమే తమకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఇది ముమ్మాటికీ గుత్తాధిపత్యమేనని ఆరోపించారు. భారత్‌లో తన స్టార్ లింక్ ఇంటర్నెట్ సేవలకు అడ్డంకులు తొలగకపోవడంతో రిలయన్స్ అధినేతను, కేంద్రంలో అధికారంలో ఉన్న ఔఅం బీజేపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఎలాన్ మస్క్ సంచలన ఆరోపణలు చేశారు. శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపులు, భారత్‌లోకి స్టార్‌లింక్ ప్రవేశంపై రిలయన్స్ జియోతో వివాదం నడుస్తున్న సమయంలో ఎలాన్ మస్క్ పాత పోస్టులు షేర్ చేసి అటు కేంద్రంలోని బీజేపీని, ఇటు అంబానీని ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.తన ఆరోపణలకు బలం చేకూర్చేందుకు ఎలాన్ మస్క్ ఎక్స్ వేదికగా 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్', 'అల్ జజీరా' గతంలో రాసిన కథనాలను షేర్ చేశారు. ఎలక్టోరల్ బాండ్ల) ద్వారా రిలయన్స్ అనుబంధ సంస్థగా ప్రచారంలో ఉన్న 'క్విక్ సప్లై' కంపెనీ, అధికార బీజేపీకి రూ. 385 కోట్లు, శివసేన పార్టీకి రూ. 25 కోట్లు విరాళంగా ఇచ్చిందని ఆ కథనాల్లో కనిపిస్తుంది. బీజేపీకి అందిస్తున్న విరాళాల ద్వారానే రిలయన్స్ అధినేత అంబానీ మద్దతు పొందుతున్నారని మస్క్ ఆరోపించారు. అయితే, క్విక్ సప్లై కంపెనీ ఇండిపెండెంట్ సంస్థ అని, దాంతో తమకు ఎలాంటి సంబంధం లేదని రిలయన్స్ ఇదివరకే క్లారిటీ ఇచ్చింది. మస్క్ చేసిన తాజా వ్యాఖ్యలపై రిలయన్స్ నేరుగా స్పందించలేదు. వెనిజులాలో స్టార్ లింక్ సేవలు ప్రారంభమవుతున్నాయని, అందుకు కావాల్సిన అన్ని పర్మిషన్లు వచ్చాయని మస్క్ మరో పోస్ట్ చేశారు.ఎలాన్ మస్క్ ఆరోపణలను భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. భారత్ ఏ రంగంలోనూ గుత్తాధిపత్యాన్ని అనుమతించదని, అన్ని సంస్థలకు ఒకే విధమైన రూల్స్ ఉంటాయని తెలిపింది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌తో పాటు జియో శాటిలైట్, భారతీ ఎయిర్‌టెల్ మద్దతున్న వన్ వెబ్ కంపెనీలకు కూడా ప్రాథమిక లైసెన్సులు ఇచ్చామని కేంద్రం పేర్కొంది. అయితే వాణిజ్య సేవలు, స్పెక్ట్రమ్ కేటాయింపులకు ముందు భద్రతాపరమైన తనిఖీలు తప్పనిసరి అని, ఏ సంస్థలకు కేంద్రం వత్తాసు పలకాల్సిన అవసరం లేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. అన్ని కంపెనీలకు ఒకే విధమైన భద్రతా నియమాలు వర్తిస్తాయని కేంద్రం స్పష్టం చేసింది

# పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్, విద్యార్థులకు వ్యాస రచన పోటీలకు ఆహ్వానం

## జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు



గద్వాల అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర బ్యూరో)పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే)ను పురస్కరించుకొని జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలో గల ఔత్సహిక ఫోటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ కు సంబంధించి, విద్యార్థులకు వ్యాస రచన పోటీలకు సంబంందించి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఈనెల 21 న వారోత్సవాలు నిర్వహించబడుతాయని ఈ పోటీలకు విద్యార్థులతో పాటు, యువత ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు ఉత్సహంగా పాల్గొనాలని అన్నారు. ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే ఇటీవల కాలంలో తీసిన ఫోటోలు ఫోటోగ్రఫీ పోటీలకు మరియు తక్కువ నిడివి (3 నిమిషాల లోపు ) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 23వ తేదీలోపు జిల్లా పోలీస్ కార్యాలయంలో సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్, 10 ఇ 8 సైజ్ ఫోటోలను పోలీస్ పి.ఆర్.ఓ. కు అందజేయాలన్నారు. గత సంవత్సరం 2025 అక్టోబర్ నుండి ప్రస్తుత సంవత్సరం అక్టోబర్ నెల ఇప్పటివరకు తీసిన మూడు ఫోటోలు, షార్ట్ ఫిల్మ్ మాత్రమే పంపించాల్సి వుంటుంది. ఈ నెల 23 వ తారీఖు లోపు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పిఅర్ఓ. సెక్షన్ నందు ఇవ్వాల్సి వుంటుందని అన్నారు.విద్యార్థులకు వ్యాస రచన పోటీలుపోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీ నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ పోటీలు మూడు భాషల్లో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో విద్యార్థులు పాల్గొనవచ్చుఅని అన్నారువ్యాసరచన అంశలు..6వ తరగతి నుండి 12 వ తరగతి వరకుసైబర్ నేరాల నివారణలో పోలీసు-పౌరుల యొక్క పాత్ర. డ్రగ్స్ మెనెన్స్.. నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుండి ఎల దూరంగా ఉండగలరుడిగ్రీ నుండి పీజీ వరకు..సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర. విద్యార్థులు తమ వ్యాసాలను అక్టోబర్ 26 వ తేదీ లోగా సమర్పించాలని , ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుంది. అంతే కాకుండా జిల్లా స్థాయిలో 1వ, 2వ, 3వ స్థానాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయబడతాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా,రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి బహుమతులు పొందాలని ఎస్పీ గారు సూచించారు.పోటీలో పాల్గొనే విధానంకింద ఇవ్వబడిన లింక్‌పై క్లిక్ చేసి పాల్గొనండి https://forms.gle/YkeKUscWu5LFYWFH7. మీ పేరు, విద్యార్హత, ఇతర వివరాలు నమోదు చేయండి.వ్యాసాన్ని పేపర్‌పై రాసి, దానిని చిత్రం లేదా పిడిఎఫ్. ఫార్మాట్‌లో (500 పదాలు మించకూడదు) అప్‌లోడ్ చేసి సబ్మిట్ చేయండి.మరిన్ని వివరాల కోసం 8712661828 నెంబర్ ద్వారా పి.ఆర్.ఓ. ను సంప్రదించాలన్నారు.సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం శ్రమించి తమ అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ నిర్వహిస్తున్న పోటీలకు విధ్యార్థులతో పాటు, ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర)హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య హనుమకొండ జిల్లాలోని పెద్దమ్మగడ్డ, పోచమ్మకుంట, లష్కర్ సింగారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (యు పి ఎచ్ సి ఎన్ నందర్శించి, అక్కడ అందిన్స్తున్న వైద్య సేవలను పరిశీలించారుప్రస్తుతం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు సమ్మె నిర్వహిస్తున్న నేపథ్యంలో, ప్రజలకు వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా గ్రామీణ ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి సిబ్బందిని ఈ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు డిప్యూటేషన్‌పై నియమించినట్లు తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ప్రజలకు అవసరమైన వైద్య సేవలు నిరంతరాయంగా అందుతున్నాయని పేర్కొన్నారు.ఈ మూడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కలిపి 100 మందికి పైగా రోగులకు ఔట్ పేషెంట్ (ఒపీ ) సేవలు అందించినట్లు తెలిపారు. అలాగే, కుక్క కాటు బాధితులకు కూడా అవసరమైన వైద్య సేవలు అందించి, చికిత్స అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.ప్రజారోగ్య పరిరక్షణకు వైద్య ఆరోగ్యశాఖ ప్రాధాన్యత ఇస్తుందని, సమ్మె పరిస్థితుల్లోనూ సాధారణ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య తెలిపారు.

# జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

## గౌరీమాతకు పూజలు నిర్వహించిన అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు





గద్వాల అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర బ్యూరో)బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో వివిధ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఆయా శాఖల మహిళా ఉద్యోగినులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ఈ ఉత్సవంలో భాగస్వాములయ్యారు. అదనపు కలెక్టర్ నర్సింగారావు తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని గౌరీమాతకు, రంగురంగుల పూలతో ఆకట్టుకునే రీతిలో ముస్తాబు చేసిన బతుకమ్మలకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ముఖ్యంగా రెవెన్యూ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా సంక్షేమ శాఖలు అందంగా అలంకరించిన బతుకమ్మలు కనువిందు చేస్తూ, పూల పండుగ ప్రాధాన్యతను చాటాయి. బతుకమ్మ గేయాలను ఆలపిస్తూ మహిళా ఉద్యోగులు, యువతులు, మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆటలాడుతూ ఎంతో ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. దాండియా, కోలాటాలతో బతుకమ్మ సంబురానికి వన్నె చేకూర్చారు. ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యాలయ పనివేళలు ముగిసినప్పటికీ ఉద్యోగినులు ఎవరూ ఇళ్లకు వెళ్లకుండా ఎంతో హుషారుగా ఈ ఉత్సవంలో పాల్గొని బతుకమ్మ వేడుక ఔన్నత్యాన్ని చాటారు. ఉత్తమ అలంకరణతో కూడిన బతుకమ్మలను ఎంపిక చేసి, బహుమతులు అందజేశారు. ఈ ఉత్సవాల్లో రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు వారి సిబ్బంది, పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కిట్స్ వరంగల్ క్యాంపస్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర)ఈ వేడుకలు తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని, మహిళా సాధికారతను మరియు విద్యార్థుల ఐక్యతను ప్రతిబింబించాయి; ఇవి మొత్తం కిట్స్ వరంగల్ సమాజానికి ఒక చిరస్మరణీయ అనుభవాన్ని అందించాయి.ఈరోజు, మ్యూజిక్ డ్యాన్స్ అండ్ ఉ ఫైనార్ట్స్ (ఎం డి యఫ్) క్లబ్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్) ఉ మరియు సహస్ర ఉమెన్ సెల్, కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఉ సైన్స్, వరంగల్ (కిట్స్ డబ్ల్యు) ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు సంయుక్తంగా నిర్వహించబడినది అని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి సగర్వంగా తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూబతుకమ్మ యొక్క సాంస్కృతిక ప్రాముఖ్యతను, దాని పుష్ప సౌందర్యం, ప్రకృతి ప్రాముఖ్యత, ఐక్యత మరియు స్త్రీత్వపు బలాన్ని నొక్కిచెప్పారు. బతుకమ్మ తెలంగాణ యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ఒక ప్రత్యేకమైన, పర్యావరణ అనుకూలమైన పండుగ అని, ఇది ప్రజలు మరియు ప్రకృతి మధ్య సామరస్య సంబంధాన్ని చాటిచెబుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు రంగురంగుల పువ్వులను తీసుకువచ్చి, తమ సొంత బతుకమ్మలను అందంగా అలంకరించుకుని, క్యాంపస్ అంతటా పండుగ వాతావరణాన్ని సృష్టిస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ ఎంపీ, కిట్స్ వరంగల్ ఛైర్మన్, కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు ఉ కోశాధికారి పి.నారాయణరెడ్డి హుస్నాబాద్ నియోజకవర్గ ఫార్మర్ ఎమ్మెల్యే ఉ కిట్స్ వరంగల్ అడిషనల్ సెక్రటరీ, వి. సతీష్ కుమార్ గారు కార్యనిర్వాహక సాక్ అధ్యాపక బృందంను,సహస్ర ఉమెన్ సెల్, మహిళా అధ్యాపకులు మరియు విద్యార్థి బృందాన్ని బతుకమ్మ పండుగని ఘనంగా విజయ వంతం చేసినందుకు శుభాకాక్షలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ విద్యార్థి వ్యవహారాల ప్రొఫెసర్ కె. శ్రీధర్; ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ చైర్‌పర్సన్ డాక్టర్ కె. సౌజన్య మరియు కన్వీనర్ శ్రీమతి వి. గౌతమి; అసోసియేట్ ప్రొఫెసర్ మరియు పి.ఆర్.ఓ డాక్టర్ డి. ప్రభాకరా చారి; ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జులు డాక్టర్ పి. ఎస్. ఎస్. మూర్తి మరియు డాక్టర్ కె. శైలజ; లిటరరీ క్లబ్ ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గ్రేస్ శాంతి; అలాగే ఎం.డి.ఎఫ్ క్లబ్ అధ్యక్షురాలు ఎ. దివ్య మరియు పి.ఎమ్.సి అధ్యక్షుడు ఎన్. అక్షయ్ వంటి విద్యార్థి ప్రతినిధులు, అధ్యాపకులు, సిబ్బంది మరియు 500 మందికి పైగా ఉమెన్ విద్యార్థులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనడంతో, ఈ కార్యక్రమం ఘనవిజయం సాధించింది.

# దసరా నాటికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభించాలి: సీఎం ఆదేశాలు

## మొదటి దశ పనులు పూర్తి.. ఈ నెల 20 నుంచి 3,000 మంది రోగులకు ఓపీ సేవలు



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర)వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి గార్లతో కలిసి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దసరా నాటికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభించేందుకు మొదటి దశ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి రోజుకు 3,000 మంది రోగులకు ఓపీ సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు శ్రీమతి చాహత్ బాజ్ పాయ్, సత్య శారద, అంపీడీసీల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తా

## మొత్తం స్మార్ట్ రేషన్ కార్డులు 687 పాతవి 550, కొత్తవి 137

## కుక్కింద గ్రామ సర్పంచ్ పట్లోళ్ల మానెమ్మ రాములు

వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 విజన్ ఆంధ్ర) : గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని కుక్కింద గ్రామ సర్పంచ్ పట్లోళ్ల మాణెమ్మ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఏ సమస్యలున్న నా దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తానని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి మొత్తం స్మార్ట్ రేషన్ కార్డులు 687 కాగా అందులో 550 పాతవి కొత్తవి 137 వచ్చాయని తెలిపారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఆమె పేర్కొన్నారు. బూత్ నంబర్ 196 లో 774 ఓట్లు ఉండగా 95 ఓట్లు తొలగించబడ్డవని ప్రస్తుతం 679 ఓట్లు మాత్రమే మిగిలాయని స్పష్టం చేశారు. బూత్ నంబర్ 197లో 483 ఓట్లు ఉండగా, 80 ఓట్లు తొలగించబడినవని ప్రస్తుతం మిగిలిన ఓట్లు 403 ఉన్నాయని ఆమె వివరించారు. గ్రామంలో మొత్తానికి ఎస్ ఐ ఆర్ ప్రక్రియ అనంతరం ప్రస్తుతం ఉన్న మొత్తం ఓట్లు1082 ఉన్నాయని, మొత్తం తొలగించబడిన ఓట్లు 175అని ఆమె స్పష్టం చేశారు.

# ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ

## అర్హులైన యువత ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

## బద్దెనపల్లి ఓటరు నమోదు శిబిరాన్ని పరిశీలించిన కలెక్టర్

తంగళ్లపల్లి, అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర):ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని, 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో గురు, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో భాగంగా గురువారం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 278, 279 పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఫారం-6 ద్వారా వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకోగా, ఇప్పటివరకు 12 దరఖాస్తులు వచ్చినట్లు బూత్ లెవల్ అధికారి తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తొలిసారి ఓటరుగా నమోదు కావాలనుకునే యువత తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం కూడా ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయని, ఆయా కేంద్రాల్లో బీఎల్ఓలు, బీఎల్ఏలు అందుబాటులో ఉంటారని తెలిపారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.
కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో శ్రీధర్ బాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ మురళి, సర్పంచ్ చిలువేరి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# అలల తాకిడికి కొట్టుకుపోతున్న వారిని రక్షించిన జీవీఎంసీ స్విమ్మర్లు

విశాఖ విశాఖ ఆర్కే బీచ్‌లో సముద్రపు అలలు ఓ కుటుంబాన్ని ప్రమాదంలోకి నెట్టాయి. అలల తాకిడికి కొట్టుకుపోతున్న ఏలూరుకు చెందిన కుటుంబ సభ్యులను జీవీఎంసీ స్విమ్మర్లు సాహసోపేతంగా రక్షించారు. సముద్రంలో అలల ఉద్ధృతి మధ్య చిక్కుకున్న కుటుంబాన్ని గుర్తించిన స్విమ్మర్లు.. వెంటనే రంగంలోకి దిగి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. సమయస్ఫూర్తితో స్పందించి ప్రాణాపాయం నుంచి

కాపాడిన జీవీఎంసీ స్విమ్మర్లపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. సముద్రంలోకి వెళ్లే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని, అలల ఉద్ధృతి ఎక్కువగా ఉన్నప్పుడు నీటిలోకి దిగవద్దని సూచిస్తున్నారు.

## తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు

### సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు




హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 ( విజన్ ఆంధ్ర ): తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు అన్నారు. హనుమకొండ మండలం గుండ్ల సింగారం గ్రామంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ కాలనీ లో గురువారం అత్యంత వైభవంగా ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు బతుకమ్మ ఆట-పాట-మాట నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మన అస్తిత్వానికి ప్రతీక అయినటువంటి మన సంస్కృతికి వారధి అయినటువంటి బతుకమ్మ పండుగను తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ అత్యంత వైభవంగా జరుపుకునే పండుగలలో అతిపెద్ద పండుగ అని కొనియాడారు. ప్రకృతి పరవశించే విధంగా భిన్న రకాల పువ్వులతో బతుకమ్మలను పేర్చి ఆడే బతుకమ్మ ఎంతో విశిష్టతమైనదని అన్నారు. బతుకమ్మ అంటే పూల పండుగ మాత్రమే కాదని, మన ఆడపడుచుల ఆత్మీయతకు, తెలంగాణ ఆచారాలకు అందమైన వేడుక అని అన్నారు. అదే విధంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ మహిళ పెళ్ళికి తులం బంగారం, విద్యార్థినిలకు స్కూటీలు, వితంతువుల పెన్షన్లు రెట్టింపు, స్థానిక సంస్థల రిజర్వేషన్లలో 50 శాతం మహిళలకు కేటాయింపు వాగ్దానాలను, గ్యారంటీలను బతుకమ్మ పండుగ సందర్భంగా వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, జిల్లా నాయకులు మాలోత్ శంకర్ నాయక్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాసమళ్ళ దీన, సిపిఐ నాయకులు పూజారి అమృతయ్య, కోడెపాక బాబు, మామునూరి దామోదర్, కేతపాక ప్రసాద్, మాలోత్ మంగ, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు తాటికంటి మమత, రొంటాల శ్యామ్, కళ్యాణి, హేమలత, లావణ్య, శిరీష, పద్మ, సునీత, కవిత తదితరులు పాల్గొన్నారు.

## 98 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణి



కాగజ్‌నగర్, అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 98 మంది లబ్ధిదారులకు సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు చెక్కులను పంపిణీ చేశారు. కాగజ్‌నగర్ పట్టణం, మండలానికి చెందిన 82 మంది లబ్ధిదారులతో పాటు సిర్పూర్ మండలానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపిల్లల వివాహాల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వివాహ సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ పథకాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ కానుకను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందడం ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా, మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, తహసీల్దార్ మల్లెపూల మధుకర్, కౌన్సిలర్లు జ్యోతి, అల్లాడి రాజు, ముబీన్, సర్పంచులు రాచర్ల రజినీ మహేష్, చంకాపురి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## దసరా దేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా

### శ్రీ జోగులాంబ అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణకు మంత్రి ,ఏఐసిసి. కార్యదర్శి రాక



అలంపూర్ అక్టోబర్ 15 (డివిజన్ ఆంధ్ర బ్యూరో)తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దసరా నవరాత్రుల్లో గౌరవ పశు సంవర్ధక క్రీడల శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి, ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్. ఎస్. ఏ .సంపత్ కుమార్ అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠం అయినా శ్రీ జోగులాంబ అమ్మవారికి సతి సమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించడానికి అక్టోబర్ 16 వ తేదీ శుక్రవారం రోజున ఉదయం 9 గంటలకు అలంపూర్ శ్రీ బాల బ్రహ్మేశ్వర జోగులాంబ అమ్మవారి దేవాలయానికి విచ్చేయనున్నారు .కావున మంత్రి కి ఆహ్వానం పలుకుటకు అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, పదాధికారులు, సర్పంచులు ,మండల అధ్యక్షులు , అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు , పత్రిక సోదరులు,పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు సురేష్ గౌడ్(న్యాయవాది) పిలుపునిచ్చారు.

# పీఎండీడీకేవై లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

### కేంద్ర మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ, పీఎండీడీకేవై జిల్లా నోడల్ అధికారి పౌసుమి బసు



గద్వాల అక్టోబర్ 15( విజన్ ఆంధ్ర బ్యూరో)పీఎండీడీకేవై లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ పీఎండీడీకే జిల్లా నోడల్ అధికారి పౌసుమిబసు అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన అమలుపై పీఎండీడీకేవై జిల్లా నోడల్ అధికారి పౌసుమి బసు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో పథకం అమలు తీరు,ఇప్పటివరకు సాధించిన పురోగతి,వివిధ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, భవిష్యత్తులో అమలు చేయనున్న కార్యాచరణను వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర నోడల్ అధికారి పౌసుమిబసు మాట్లాడుతూ,జిల్లాలో ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకం లక్ష్యాలను నిర్దేశిత నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వెనుకబడిన సూచికలను గుర్తించి,వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని, ఒక మండలాన్ని మోడల్‌గా ఎంపిక చేసి,అక్కడ పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయం, ఆయిల్‌పామ్ సాగు తదితర పద్ధతులను సమగ్రంగా అమలు చేయాలన్నారు. మోడల్ మండలంలో సాధించిన ఫలితాలను ఇతర మండలాలకు విస్తరించడం ద్వారా రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. చిన్న,సన్నకారు రైతులకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా అవసరమైన సహకారం అందించాలని,వాటిని బ్యాంకు రుణ సదుపాయాలతో అనుసంధానం చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగు,సేంద్రియ వ్యవసాయం,పంటల వైవిధ్యీకరణపై మరింత దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలో యూరియా వినియోగం తగ్గడం అభినందనీయమని పేర్కొంటూ, ఇందుకు దోహదపడిన చర్యలు, అనుసరించిన పద్ధతులను కేస్ స్టడీ రూపంలో డాక్యుమెంటేషన్ చేసి సమర్పించాలని సూచించారు. పీఎండీడీకేవై పథకం అమలులో ఎదురయ్యే సమస్యలు, అవసరమైన సహకారం గురించి తమ దృష్టికి తీసుకువస్తే,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని కేంద్ర నోడల్ అధికారి తెలిపారు.

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ,పీఎండీడీకేవై లక్ష్యాల సాధనకు అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వ్యవసాయంలో యూరియా వినియోగం తగ్గింపు,ప్రకృతి వ్యవసాయం, పంటల వైవిధ్యీకరణతో పాటు పశు సంవర్ధక,మత్స్య రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు. మహిళా సంఘాలు,రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, సూక్ష్మ ఆహార పరిశ్రమలను ప్రోత్సహిస్తూ, వ్యవసాయ అభివృద్ధి మరియు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. జిల్లాలో పీఎండీడీకేవై లో వెనుకబడిన సూచికల్లో పురోగతి సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి,నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ ముషాయిదా బేగం,జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప, ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్,పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్,ఎల్డిఎం శ్రీనివాసరావు,ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

### విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు సహకరించాలి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల అక్టోబర్ 15( విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బెస్ట్ ఆన్లైన్ ఇంగ్లీష్ లెర్నింగ్ ఇన్స్టిట్యూట్ కు చెందిన స్పీకర్ రామేశ్వర్ గౌడ్ కొద్ది రోజులుగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఆన్లైన్లో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తుండగా, గురువారం ఐడిఓసి సమావేశపు మందిరంలో ఒకరోజు ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమం నిర్వహించగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూవిద్యార్థులకు అత్యుత్తమ బోధన చేసేందుకు ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలు అవసరమని అన్నారు. అన్ని సబ్జెక్టుల, ఎస్జీటీ ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలు మెరుగుపరచాలనే ఉద్దేశంతో ఆన్లైన్ తరగతులను నిర్వహిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యావ్యవస్థలపై అధ్యయనానికి ప్రతి ఏటా కొంతమంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపుతున్నందున డాక్యుమెంటేషన్, డ్రాఫ్ట్ నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు కూడా ఈ శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంపొందించుకొని విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. విద్యార్థులు భవిష్యత్తులో పలు పోటీ పరీక్షల్లో రాణించేందుకు, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకునేందుకు స్పోకెన్ ఇంగ్లీష్ ఉపకరిస్తుందన్నారు. వివిధ సబ్జెక్టుల పాఠ్యాంశాలే కాకుండా సాంకేతికతకు సంబంధించి ఎవరైనా సరే ఉపాధ్యాయులు ఇన్నోవేటివ్ గా ఆలోచించి సృజనాత్మక రచనలు చేస్తే బెస్ట్ ప్రాక్టీసెస్ గా గుర్తించి మంత్లీ మ్యాగజైన్ మాదిరి ముద్రించి అన్ని పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకునేందుకు జిల్లా అధికార యంత్రాంగం తరపున కృషి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం తక్కశిల జడ్పిహెచ్ఎస్ లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సుమంగళ రచించిన 'భ్రమ జీరో టు హీరో మాథ్స్ మేడ్ ఈజీ' పుస్తకాలను కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి విడుదల చేశారు. స్పీకర్ రామేశ్వర్ గౌడ్ ను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సన్మానించారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి కర్రెప్ప, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.హెచ్.ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

### ఉద్యోగ భద్రత కల్పించాలి




నారాయణపేట , అక్టోబర్ 15 ( విజన్ ఆంధ్ర) తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం టీజీ ఎన్.హెచ్.ఎం జేఏసిఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె నారాయణపేట జిల్లాలో గురువారంతో మూడవ రోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని వివేకానంద పార్క్ వద్ద జిల్లాలోని ఎన్.హెచ్.ఎం ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా మహిళ నాయకులు తమ డిమాండ్లను ముగ్గుల రూపంలో వేసి నిరసన వ్యక్తం చేశారు. వైద్యుల నుంచి కాంటింజెంట్ వర్కర్ల వరకు వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు ఐక్యంగా సమ్మెలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దశాబ్దాలుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఎన్.హెచ్.ఎం ఉద్యోగులను ప్రభుత్వం ఎప్పుడు రెగ్యులరైజ్ చేస్తుంది, సమాన పనికి సమాన వేతనం ఎప్పుడు అమలు చేస్తుంది, ఉద్యోగ, ఆరోగ్య భద్రత ఎప్పుడు కల్పిస్తుంది అంటూ ఉద్యోగులు ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారుతున్నా ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల జీవితాల్లో మాత్రం ఆశించిన మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగులు నేటికీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో అభద్రత మధ్య పనిచేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగుల కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించిన ఉద్యోగులకు తగిన గుర్తింపు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ప్రతి సంవత్సరం 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్లు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులతో పాటు వారి కుటుంబాలకు తగిన ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. ఎన్.హెచ్.ఎం నిరసనలకు బిజెపి మద్దతుబీజేపీ పార్టీ తరపున మద్దతు ప్రకటించిన బిజెపి జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ మాట్లాడుతూఉద్యోగులకు ఆరోగ్య భద్రతతో పాటు తగిన రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్.హెచ్.ఎంఉద్యోగులకు అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసి, తెలంగాణలోనూ వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు సంబంధించి స్పష్టతనిస్తూ, ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై సాధ్యాసాధ్యాలను పరిశీలించి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబాలను పోషించేందుకు తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి రాఘవేందర్, ఎన్.హెచ్.ఎం యూనియన్ సభ్యులు డాక్టర్ నరసింహ రావు సగరి, మోనేష్ చారి, శ్రీలత, వెంటరమణ, అనురాధ, తిరుపతి, కిరీటి, శ్వేతశ్రీ, విరోజ, చందన, పుష్ప, సరస్వతి, డీడీఎం స్నేహలత, డిఏఎం మమత తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి నగర్ 276వ డివిజన్ వాసవి కాలనీలో సి.ఎం.సి నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర బ్యూరో): ప్రగతి నగర్ 276వ డివిజన్ పరిధిలోని వాసవి కాలనీలో సీఎం సి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. కాలనీ అభివృద్ధిలో భాగంగా సి.ఎం.సి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం సి, నిధుల నుంచి రూ. 17 లక్షలతో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే రూ. 13 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ. 3 లక్షలతో ఇంకుడు గుంత బోరు సంబంధిత పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం హన్మంతన్న మాట్లాడుతూ, సిఎంసి నిధులతో కాలనీల అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి), మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, 277వ డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, వాసవి కాలనీ అధ్యక్షులు మరియు సీనియర్ నాయకులు మేడ శ్రీనివాస్, నాగేశ్వర్ రావు, సురేందర్ యాదవ్, వీరబాబు, లడ్డు, నవీన్ రెడ్డి, పిల్లి ఆంజనేయులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పి. సాంశివరావు, రమేష్, గూడూరు మురళి, రమేష్ గుప్తా, మహేష్, ఆలేటి శ్రీనివాస్, అమరయ్య, రామరాజు, జగదీష్, వి. నాయేశ్వర్ రావు, భోగేశ్వర్ రావు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## బండారి లేఔట్ డివిజన్ రాజీవ్ గృహకల్ప వద్ద డా. ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహ ఆవిష్కరణ



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర బ్యూరో): బండారి లేఔట్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప వద్ద భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి, డా. ఏపీజే అబ్దుల్ కలాం గారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలాం దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఆయన జీవితం, ఆశయాలు యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, బండారి లేఔట్ డివిజన్ అధ్యక్షులు వాసు వరగాని, ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి), మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, కె. అమృతయ్య, కమిటీ నిర్వాహకులు మొయినుద్దీన్, రఫత్, రామచంద్ర నాయక్, సరిత లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్లా, నయాబ్, బాలరాజు, ప్రసాద్ గౌడ్, వెంకటేశ్వర్ గౌడ్, శ్యామ్ గౌడ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సంగెం గ్రామంలో వైభవంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

### పాల్గొన్న మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి



షాద్నగర్,అక్టోబర్15(విజన్ఆంధ్ర ):షాద్‌నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, కేశంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సబ్ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్ దుర్గాదేవి పండాల్‌ను సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా జవాజీ శాంతమ్మ నాగభూషణం గౌడ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, యువకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ ఫోన్ల అధిక వినియోగంతో వెన్నునొప్పుల ముప్పు

హైదరాబాద్, అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర): గంటల తరబడి ప్రయాణాలు, గుంతల రోడ్లు, ల్యాప్‌టాప్‌ల ముందు ఎక్కువసేపు కూర్చోవడం, మొబైల్ ఫోన్ల అధిక వినియోగం మెడ, వెన్నునొప్పులకు కారణం అవుతున్నాయని కేర్ హాస్పిటల్స్ వైద్యులు హెచ్చరించారు. అక్టోబర్ 16న ప్రపంచ వెన్నెముక దినోత్సవం సందర్భంగా కేర్ హాస్పిటల్స్ క్లినికల్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్, న్యూరో ఇంటర్వెన్షనిస్ట్, ఎండోస్కోపిక్ స్పైన్ సర్జన్ డాక్టర్ రణధీర్ కుమార్, హైటెక్ సిటీ కేర్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ మినిమల్లీ ఇన్వాసివ్ అండ్ డిఫార్మిటీ స్పైన్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్ గోపరాజు మాట్లాడుతూ సరైన భంగిమలో కూర్చోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ప్రయాణాల్లో విరామాలు తీసుకోవడం అవసరమన్నారు.

## మైనర్ బాలికను అపహరించి , పెళ్లి చేసుకొని , అత్యాచారం కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష మరియు 18,000 జరిమాన

సిద్దిపేటజిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర) సిద్దిపేట జిల్లా కేంద్రంలో గలనంగునూరు మండలకి చెందిన మైనర్ బాలికను నిందితుడు బండి భాస్కర్ (27 సంవత్సరాలు) ప్రేమ పేరుతో నమ్మించి పెళ్లి చేసుకొని అత్యాచారం చేశాడని ఫిర్యాదు మేరకు రాజగోపాలపేట పోలీస్ స్టేషన్ లో 22/04/2022 న పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడమైనది. ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారి రాజగోపాలపేట ఎస్సై మహిపాల్ రెడ్డి , సిద్దిపేట ఏసిపి దేవ రెడ్డి సమగ్ర దర్యాప్తు నిర్వహించి, పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి పటిష్టమైన ఛార్జిషీట్నున్యాయస్థానంలోదాఖలుచేయడమైనది. విచారణ సందర్భంగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మరాములు గారులి వాదనలు వినిపించగా, ప్రస్తుత సిద్దిపేట రూరల్ సీఐ విద్య సాగర్ గారు, ఎస్ఐ టి. వివేక్ , సాక్షాలు నమోదు చేసిన ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి , సీడీఓ రవి , భరోసా ఇన్చార్జ్ అధికారి ఇన్స్పెక్టర్ బి.దుర్గా, భరోసా లీగల్ అధికారి సౌమ్య, భరోసా సిబ్బంది సమన్వయంతోకేసువిచారణలోసహకారం అందించరు. సమర్పించినసాక్ష్యాధారాలు,సాక్షులవాంగ్మూలాలు మరియు ఇతర ఆధారాలను పరిశీలించినగౌరవ సిద్దిపేట 1వ ఏ డీజే న్యాయస్థానన్యాయమూర్తి వై. జయ ప్రసాద్ గారు నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు 18,000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 17/12/2017 న నమోదైన బాధితురాలీని బలాత్కారం చేయబోగా ఒప్పుకోనందున తల పైన కట్టెతో కొట్టగా రక్త గాయం అయిన కేసులో నిందితుడు మిట్టపల్లి రాజు (35)సంవత్సరాలు అనే వ్యక్తికి 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు 15,000 రూ౹౹లు జరిమానా విధిస్తూ నిన్న అనగా 14/10/2025 రోజున న్యాయమూర్తి వై. జయప్రసాద్ గారు తీర్పు వెల్లడించారు.నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన అధికారులను, సిబ్బందిని సిద్దిపేట సిపి రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ గారు అభినందించారు. మహిళలు మరియు పిల్లలపై జరిగే నేరాలపై బాధితులు భయపడకుండా, వెనుకాడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని సిపి సూచించారు. సమాజంలో మహిళల భద్రతకు తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని, నేరస్థులకు కఠిన శిక్ష పడేలా చేయడంలో ఎలాంటి రాజీ పడబోమనీ సిద్దిపేట సిపి రష్మి పెరుమాళ్, ఐపీఎస్ గారు స్పష్టం చేశారు.

# లైసెన్స్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ.20 లక్షల విలువైన పేలుడు పదార్థాలు స్వాధీనం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**20 వేల ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, 90 బూస్టర్లు, రెండు వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం**

**ఏడుగురు నిందితుల అరెస్ట్.. మరో ఇద్దరిపై కేసు నమోదు**

**ఉత్తరప్రదేశ్ నుంచి తెలంగాణకు అక్రమంగా పేలుడు పదార్థాల రవాణా**

**మైన్స్, క్రషర్లకు అధిక ధరలకు విక్రయించేందుకు కుట్రలిలిజిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పిప్పర్వాడ టోల్ ప్లాజా సమీపంలో పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేయగా, మొత్తం తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..

పేలుడు పదార్థాలను అక్రమంగా రవాణా చేయడం, ఎలాంటి అనుమతులు, లైసెన్సులు లేకుండా నిల్వ చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిప్పర్వాడ టోల్ ప్లాజా సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, రెండు వాహనాల్లో అనుమానాస్పదంగా పేలుడు పదార్థాలను తరలిస్తున్న ఏడుగురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వాహనాలను తనిఖీ చేయగా భారీ మొత్తంలో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, బూస్టర్లు బయటపడ్డాయి.

ఉత్తరప్రదేశ్ నుంచి అక్రమ రవాణా

విచారణలో నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన రవికుమార్ అనే వ్యక్తి ద్వారా పేలుడు పదార్థాలను సమకూర్చుకుంటున్నట్లు వెల్లడైంది. అక్కడి కంపెనీ నుంచి ఇతరుల పేర్లపై బిల్లులు తీసుకొని, బూస్టర్ బాక్సుల్లో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను నింపి తెలంగాణకు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. అనంతరం వాటిని క్రషర్లు, క్వారీలు, మైన్స్‌కు అధిక ధరలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

ఈ క్రమంలో నిందితులు రెండు వాహనాల్లో ఉత్తరప్రదేశ్‌కు వెళ్లి పేలుడు పదార్థాలను తీసుకువస్తుండగా, జైనథ్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు.

స్వాధీనం చేసుకున్న వస్తువుల వివరాలు:

1. ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు -- 20,000 (అంచనా విలువ రూ.19,00,000).
2. బూస్టర్లు -- 90 (అంచనా విలువ రూ.15,000).
3. బొలెరో వాహనం -- 1 (నంబర్: యూ03ఖదీ0194).
4. హోండా సిటీ కారు -- 1 (నంబర్: యూ04జు=6575).
5. సెల్‌ఫోన్లు -- 6.

స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల మొత్తం అంచనా విలువ రూ.19.15 లక్షలు. వాహనాల విలువను ఇందులో కలపలేదు. మొత్తం స్వాధీనం విలువను సుమారు రూ.20 లక్షలుగా పేర్కొన్నారు. ఈ ఘటనపై జైనథ్ పోలీస్ స్టేషన్‌లో మొత్తం తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి, ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. పేలుడు పదార్థాలను ఎక్కడి నుంచి సేకరించారు, ఎవరికి సరఫరా చేయాలనుకున్నారు, ఈ అక్రమ రవాణాలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే అంశాలపై పోలీసులు లోతుగా విచారణ చేపడుతున్నారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే అక్రమ కార్యకలాపాలపై పోలీసు శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు. అరెస్టయిన నిందితుల వివరాలు: 1. చెప్యాల పరశురాము (30) -- తండ్రి: రవి, స్వస్థలం: కనగుర్తి గ్రామం, ఓదెల మండలం, పెద్దపల్లి జిల్లా; ప్రస్తుతం మేడిపల్లి, బోడుప్పల్ ప్రాంతం. 2. వల్లెపు తేజ (23) -- తండ్రి: స్వామి, స్వస్థలం: దుర్గా నగర్ కాలనీ, హనుమకొండ; ప్రస్తుతం కొప్పూర్ గ్రామం, భీమదేవరపల్లి మండలం. 3. కదం శ్రావణ్ (36) -- తండ్రి: రాములు, నివాసం: నరసింహులపల్లి గ్రామం, వీణవంక మండలం.

4. కస్తూరి సునీల్ (26) -- తండ్రి: ఐలయ్య, నివాసం: కొప్పూర్ గ్రామం, భీమదేవరపల్లి మండలం. 5. సూర రంజిత్ (25) -- తండ్రి: మైసయ్య, నివాసం: విశ్వనాథ్ కాలనీ, భీమదేవరపల్లి. 6. కస్తూరి మధు కిరణ్ (28) -- తండ్రి: మొరయ్య, నివాసం: చింతలపల్లి గ్రామం, శంకరపట్నం మండలం. 7. పాగల సంపత్ రెడ్డి (52) -- తండ్రి: నర్సింహారెడ్డి, నివాసం: చింతలపల్లి గ్రామం, శంకరపట్నం మండలం.

కేసులో మరో ఇద్దరు నిందితులు: ఎం.డి. వాహిద్, రవికుమార్. వీరి వివరాలు, పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది.

ఈ మీడియా సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, జైనథ్ సీఐ జి. శ్రావణ్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై పి. గౌతమ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యూనిక్ కంపెనీ పేరుతో భారీ పెట్టుబడి మోసం.. ప్రధాన నిందితుడు అరెస్ట్

**చిట్ ఫండ్స్, అధిక లాభాల పేరుతో వేలాది మందికి 7,8 కోట్ల టోకరా**

**దేశవ్యాప్తంగా సుమారు 10 వేల మంది బాధితులు ఉన్నట్లు ప్రాథమిక అంచనా**

**తెలంగాణలో వందల కోట్ల రూపాయల మోసం జరిగినట్లు గుర్తింపు**

**ఆదిలాబాద్ జిల్లాలో సుమారు రూ.7--8 కోట్ల మేర లావాదేవీలు**

**మోసం చేసిన సొమ్ముతో పలు రాష్ట్రాల్లో హోటళ్లు, భూములు, ప్లాట్ల కొనుగోలు**

**తెలంగాణలో 14 కేసులు.. మరో నిందితుడు పరారీలో**

**బాధితులు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలి -- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**




ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర): యూనిక్ మర్చంటైల్ ఇండియా లిమిటెడ్, యూనిక్ ఎస్ఎంసీఎస్ సంస్థల పేరుతో చిట్ ఫండ్స్, పెట్టుబడి పథకాల ద్వారా అధిక లాభాలు వస్తాయని ప్రజలను నమ్మించి భారీగా డబ్బులు సేకరించి మోసాలకు పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్ల రూపాయల మోసం జరిగినట్లు, దేశవ్యాప్తంగా సుమారు 10 వేల మంది బాధితులు ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు.స్థానిక పోలీస్ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు.మోసం చేసిన తీరునిందితులు యూనిక్ సంస్థల పేరుతో వివిధ పెట్టుబడి పథకాలను ప్రవేశపెట్టి, ఏజెంట్ల ద్వారా ప్రజలను ఆకర్షించినట్లు విచారణలో వెల్లడైంది. వార్షిక చెల్లింపులు, నెలవారీ కిస్తీలు, ఫిక్స్డ్ డిపాజిట్లు తదితర పథకాల ద్వారా డబ్బులు సేకరించారు. పెట్టుబడి పెట్టిన మొత్తానికి అదనపు ప్రయోజనాలు కలిపి తిరిగి చెల్లిస్తామని, అవసరమైతే మంచి ప్రాంతాల్లో ప్లాట్లు కేటాయిస్తామని నమ్మించారు.గడువు పూర్తయినప్పటికీ పెట్టుబడి మొత్తాలు, మెచ్యూరిటీ డబ్బులు తిరిగి చెల్లించకుండా కాలయాపన చేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై ఆదిలాబాద్ వన్‌టౌన్, టూటౌన్, మావల, ఆదిలాబాద్ రూరల్, తలమడుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి.ప్రాథమిక విచారణ ప్రకారం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ సంస్థలకు సంబంధించి 14 కేసులు నమోదైనట్లు గుర్తించారు. మెదక్, నిజామాబాద్, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లోనూ కేసులు నమోదైనట్లు సమాచారం ఉందని, ఈ వివరాలపై సంబంధిత రికార్డులను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఆస్తుల కొనుగోలుకు మోసం చేసిన సొమ్ము వినియోగంప్రజల నుంచి సేకరించిన డబ్బులతో నిందితుడు వివిధ ప్రాంతాల్లో హోటళ్లు, భూములు, ప్లాట్లు కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. బెంగళూరు, పశ్చిమ బెంగాల్, జైపూర్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో హోటళ్లు కొనుగోలు చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు.

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూములు, ప్లాట్లు కొనుగోలు చేసినట్లు, ముఖ్యంగా మియాపూర్ ప్రాంతంలో సుమారు 400 ప్లాట్లు కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. అలాగే బీబీనగర్‌లోని ఎయిమ్స్ పరిసర ప్రాంతాల్లో సుమారు 200 ఎకరాల భూములు కొనుగోలు చేసినట్లు సమాచారం ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఆస్తుల కొనుగోలుకు ఉపయోగించిన నిధుల మూలాలు, ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది.

ఆదిలాబాద్ జిల్లా పరిధిలో సుమారు 2,000 మంది సభ్యులతో రూ.7 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు లావాదేవీలు జరిగినట్లు నిందితుడి విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలో బాధితులు కోల్పోయిన మొత్తం, ఇతర ఆర్థిక వివరాలను మరింతగా పరిశీలిస్తున్నారు.ప్రధాన నిందితుడి అరెస్ట్తలమడుగు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో విశ్వసనీయ సమాచారం మేరకు 13న రాత్రి ఆదిలాబాద్ కలెక్టరేట్ చౌక్ వద్ద ప్రధాన నిందితుడు రాజ్ కుమార్ రాయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తలమడుగు పోలీస్ స్టేషన్‌కు తరలించి చట్టప్రకారం అరెస్ట్ చేశారు.

లినిందితుల వివరాలు

ా-1: రాజ్ కుమార్ రాయ్ ఏ రాజ్ కుమార్ కైలాష్ రాయ్ (69)

యూనిక్ మర్చంటైల్ ఇండియా లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ / హోల్‌టైమ్ డైరెక్టర్. నివాసం: థల్తేజ్, అహ్మదాబాద్, గుజరాత్ రాష్ట్రం.

స్థితి: అరెస్ట్.

ా-2: చంద్రశేఖర్

యూనిక్ ఎస్ఎంసీఎస్ సంస్థ జోనల్ మేనేజర్, హైదరాబాద్.

స్థితి: పరారీలో ఉన్నాడు.

లిగతంలోనూ మోసాలకు పాల్పడినట్లు సమాచారంలి

నిందితుడు గతంలో మెడికల్ కంపెనీ ఏర్పాటు పేరుతో, హోటళ్లలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మోసాలకు పాల్పడినట్లు సమాచారం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారాలకు సంబంధించిన ఫిర్యాదులు, కేసులు, ఇతర వివరాలను పరిశీలిస్తూ నిందితుడి గత కార్యకలాపాలపైనా దర్యాప్తు చేస్తున్నారు.

లిబాధితులు ముందుకు రావాలిలి

యూనిక్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టి మోసపోయిన బాధితులు ఎవరూ భయపడకుండా సంబంధిత పోలీస్ స్టేషన్లను సంప్రదించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. బాధితులు తమ వద్ద ఉన్న పెట్టుబడి రశీదులు, బ్యాంకు లావాదేవీల వివరాలు, ఒప్పంద పత్రాలు, ఇతర ఆధారాలను పోలీసులకు అందించాలని తెలిపారు.

ఆకర్షణీయమైన పథకాలు, అధిక లాభాల హామీలను నమ్మి పెట్టుబడులు పెట్టే ముందు సంస్థ విశ్వసనీయతను పూర్తిగా పరిశీలించాలని ప్రజలకు సూచించారు. ఈ కేసులో బాధితుల వివరాలను సేకరించడంతో పాటు, నిందితులతో సంబంధం ఉన్న ఇతర వ్యక్తుల పాత్రపైనా దర్యాప్తు కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు.

ఈ సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, రూరల్ సీఐ రహీం పాషా, తలమడుగు ఎస్ఐ డి. రాధిక, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగలను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఏ ఎం సి చైర్మన్ బోరంచు,**



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర)స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా కలెక్టర్ రాజర్షి షా, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్ లు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలతో వేడుకలను ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ, నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. పూలను దైవంగా భావించి పూజించే అద్భుతమైన సాంస్కృతిక సంప్రదాయం మన బతుకమ్మ సొంతమని, పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ప్రజలందరూ ఈ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారని కొనియాడారు. జిల్లాలోని అన్ని శాఖల సమన్వయంతో ఇలాంటి సాంస్కృతిక వేడుకలను మున్ముందు మరింత ఘనంగా నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.

అనంతరం మహిళలతో కలిసి అతిథులు ఉత్సాహంగా బతుకమ్మ పాటలకు లయబద్ధంగా చప్పట్లు కొడుతూ సంబురాల్లో భాగస్వామ్యులయ్యారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, ఆదిలాబాదు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణ, డి.ఆర్.ఓ. స్రవంతి, ఏవో వర్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, తదితర రెవెన్యూ అధికారులు, సిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సరఫరాపై ఉక్కుపాదం చింతలమానేపల్లి పోలీసుల దాడులు

**ముగ్గురి అరెస్ట్, 110 గ్రాముల గంజాయి స్వాధీనం**

చింతలమానేపల్లి, అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర): గంజాయి అక్రమ రవాణా, సరఫరాపై పోలీసులు నిఘా పెంచారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, నమ్మదగిన సమాచారం మేరకు మహారాష్ట్ర నుంచి తెలంగాణలోని చింతలమానేపల్లికి గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు గూడెం నుంచి వచ్చే మార్గంలో మాటు వేసి ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 110 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. పోలీసుల విచారణలో నిందితులు మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి తీసుకొస్తున్నట్లు సమాచారం వెల్లడైంది. ఈ ఘటనపై పాగిడి ప్రసాద్ (గంగాపూర్), గాజిరెడ్డి సంతోష్ (సిర్పూర్), గొల్ల సంతోష్ (సిర్పూర్ టి)లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చింతలమానేపల్లి ఎస్సై కమలాకర్ తెలిపారు. గంజాయి విక్రయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మహారాష్ట్రకు చెందిన వ్యక్తిని కూడా త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిస కావద్దని ఎస్సై సూచించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

## ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 15(విజన్ ఆంధ్ర) కామారెడ్డి జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.గురువారం రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రం నంబరు 160లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారు, ఓటర్ల జాబితాలో పేర్లు లేని అర్హులు ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను వినియోగించుకోవాలని తెలిపారు.ఓటర్ల జాబితాలో పేర్లు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని, అవసరమైన మార్పులు, చేర్పుల కోసం సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, మండల ప్రత్యేక అధికారి అపర్ణ, హార్టికల్చర్ అధికారి జ్యోతి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సూర్యజి, డివిజన్ పంచాయతీ అధికారి శ్రీనివాస్, సర్పంచులు సంధ్య, బాబు, తదితరులు పాల్గొన్నారు.

# బీబీపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర

**సిబ్బంది విధులు, పనితీరుపై సమీక్ష**



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 15 (విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా బీబీపేట పోలీస్ స్టేషన్ ను గురువారం ఎస్పీ ఎం రాజేష్ చంద్ర తనిఖీ చేశారు. బాధ్యతాయుత విధులకు దిశానిర్దేశం చేశారు.గ్రామాల్లో దొంగతనాల నివారణకు పటిష్ట చర్యలు.. నిరంతర గస్తీ, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉండాలని అన్నారు పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారానికి చర్యలు బాధితులకు సత్వర న్యాయం అందించాలి, ఆర్థిక, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి ప్రజలను అప్రమత్తం చేయాలని, పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన రోల్‌కాల్ వివరాలు, సిబ్బందికి కేటాయించిన విధులు, బాధ్యతల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది క్రమశిక్షణతో, అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో దొంగతనాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, రాత్రి వేళల్లో నిరంతర గస్తీ నిర్వహిస్తూ రౌడీషీటర్లు, పాత నేరస్థులు, అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు.సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆన్‌లైన్ మోసాలు, అనుమానాస్పద లింకులు, ఓటీపీ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు సూచించాలని తెలిపారు. డయల్ 112 ద్వారా అందే అత్యవసర కాల్స్‌పై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర సహాయం అందించాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరిధిలో సత్వర న్యాయం అందించాలని సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులను గుర్తించి అరెస్టు చేయడంతో పాటు దొంగిలించబడిన ఆస్తిని స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో నాణ్యత పాటిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో బీబీపేట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ నవీన్ చంద్రతో పాటు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలపై ఎల్‌నినో ఎఫెక్ట్.. అడుగంటుతున్న డ్యామ్‌లు

తిరుమల,ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమలలో ఎల్‌నీనో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు వర్షాభావ పరిస్థితులతో శ్రీవారి కొండపై నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. అప్పుడప్పుడు తేలికపాటి వర్షాలు కురుస్తున్నప్పటికీ, జలాశయాల్లో నీటి మట్టాలు పెరగకపోవడం అధికారులు, భక్తుల్లో ఆందోళన కలిగిస్తోంది.గతంలో కేవలం సెలవు రోజుల్లో మాత్రమే తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండేది. కానీ, ఇటీవల రోజులతో సంబంధం లేకుండా నిత్యం లక్షలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలివస్తున్నారు.

## రైతుకు కాసులు వర్షం కురిపిస్తున్న పూల పండుగ..!

జహీరాబాద్, అక్టోబర్ 15సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పూల మార్కెట్ ప్రస్తుతం పండుగలతో కళకళలాడుతోంది. బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు వరుసగా రావడంతో పూలకు ఎప్పుడూ లేనంత డిమాండ్ ఏర్పడింది. దీంతో పూల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆరు నెలలు కష్టపడి పండించిన పూల రైతులకు ఇప్పుడు కాసుల పంట పండుతోంది. బంతి పూలకే ఎక్కువ గిరాకీ..: బతుకమ్మ పండుగ అంటేనే పూల పండుగ. బతుకమ్మను పేర్చడానికి ప్రధానంగా బంతి పూలు, గునుగు పూలు, తంగేడు పూలు వాడతారు.

# దసరా వేళ సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా గిరి బ్రదర్స్

- పేదలకు అన్నదానం.. పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ
- ఉప్పల్ శ్రీకృష్ణ థియేటర్ యాజమాన్యం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు





కాప్రా / అక్టోబర్ 15( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : దసరా పండుగను పురస్కరించుకుని ఉప్పల్ శ్రీకృష్ణ థియేటర్ యాజమాన్యం గిరి బ్రదర్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గిరి నరసింహ, గిరి మహేశ్ నేతృత్వంలో పేదలకు అన్నదానం చేయడంతో పాటు పట్టణ పరిశుభ్రతకు నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. పండుగ వేళ పేదలకు ఆహారం అందించి, పారిశుద్ధ్య కార్మికులను గౌరవించడం ద్వారా గిరి బ్రదర్స్ తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. కార్మికుల సేవలను గుర్తించి వస్త్రాలు పంపిణీ చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు, సంఘం ప్రతినిధులు గిరి బ్రదర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి నెలా పేదలకు అన్నదానం

ఉప్పల్ శ్రీకృష్ణ థియేటర్‌లో గిరి బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రతి నెలా పేదలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉప్పల్ పరిసర ప్రాంతాల్లోనూ పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పండుగలకే పరిమితం కాకుండా నిరంతరం పేదలకు అండగా నిలుస్తూ, సమాజ సేవలో భాగస్వాములవుతున్న గిరి బ్రదర్స్‌ను స్థానికులు అభినందించారు.

# చర్లపల్లి లో ఘనంగా కార్మిక బతుకమ్మ సంబరాలు..!



కాప్రా /అక్టోబర్ -15(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి సి.ఐ.టి.యు.రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ తెలంగాణలో దసరా పండుగను పెద్ద ఎత్తున సాంప్రదాయం పద్ధతిలో ఘనంగా జరుపుకుంటారని అన్నారు. ముఖ్యంగా మహిళలు 9 రోజులపాటు వివిధ రూపాలలో పేర్లతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సంతోషంగా నిర్వహిస్తారని అన్నారు. పూలను పూజించే సమాజం ఆడపిల్ల పుట్టినప్పుడు వివక్ష చూపడం బాధాకరమని అన్నారు. బతుకమ్మ అంటే బతుకు అమ్మ అని అర్థం వస్తుందని అన్నారు. అందుకే ఆడపిల్లను పుట్టనిద్దాం బ్రతకనిద్దాం ఎదగనిద్దాం అని అన్నారు. మహిళా హక్కులకై మహిళల వేధింపులపై పని ప్రదేశంలో లైంగిక హింసకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాడాలని అన్నారు. మహిళలకు సమాజంలో సమాన హక్కులు కల్పించాలని వివక్షలేని సమాజం నిర్మాణం కోసం అందరం కలిసి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఏ.అశోక్ చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బి.వి. సత్యనారాయణ జి. శ్రీనివాసులు జిల్లా కోశాధికారి పి. గణేష్, మేడ్చల్ జిల్లా ఆశ వర్కర్స్ ప్రధాన కార్యదర్శి రేవతి, వివిధ యూనియన్ల ప్రధాన కార్యదర్శులు ఎస్.ఎస్. మణికంఠ టి నరసింహ కే. బాలరాజు, టి.రవీందర్ రెడ్డి, ఆదామ్, సంతోష్, శ్రీనివాస్, రాంబాబు, మన్మధరావు, చారి, సుబ్రహ్మణ్యం, నరసమ్మ మరియమ్మ,లావణ్య, మోక్షలక్ష్మి, పద్మ, అనిత విజయ తదితరులు పాల్గొన్నారు

# ఉస్మానియా యూనివర్సిటీలో ఘనంగా ముగిసిన సీఐఎస్‌సీఈ జాతీయ అథ్లెటిక్స్ పోటీలు..!

- 870 మంది బాలికల ప్రతిభా ప్రదర్శన..! - రికార్డులు బద్దలు..!










కాప్రా /అక్టోబర్ -15(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : హబ్సిగూడ సెయింట్ జోసెఫ్ పాఠశాల ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌పై మూడు రోజులపాటు నిర్వహించిన సీఐఎస్‌సీఈ 7వ జాతీయ బాలికల అథ్లెటిక్స్ పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 15 ప్రాంతాలకు చెందిన సుమారు 870 మంది బాలికలు పాల్గొన్నారు. ట్రాక్, ఫీల్డ్, జంపింగ్ విభాగాల్లో పోటీపడిన పలువురు క్రీడాకారిణులు గత రికార్డులను అధిగమించడం విశేషం.ముగింపు వేడుకలకు ఏఐఎస్ఎస్‌సీ కార్యదర్శి, కోశాధికారి ఫాదర్ ఎస్. జోసెఫ్ ప్రత్యేక ఆహ్వానితుడిగా, అంతర్జాతీయ అథ్లెట్ ఎం. కల్పనా రెడ్డి, డాక్టర్ గాడ్విన్ డేనియల్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు, ఛాంపియన్‌షిప్ ట్రోఫీలు అందజేశారు. స్వర్ణ, రజత పతక విజేతలతో సీఐఎస్‌సీఈ జట్టును ఏర్పాటు చేసి ఎస్‌జీఎఫ్ఐ స్థాయి పోటీలకు పంపించనున్నట్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్పోర్ట్స్ కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ థెరిసా తెలిపారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన పాఠశాల యాజమాన్యం, కోచ్‌లు, నిర్వాహకులను ఆమె అభినందించారు.

# ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు ముందస్తు, ప్రత్యామ్నాయ ప్రణాళికలపై సమీక్ష

## తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత.. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి వి.పి. గౌతం



మహబూబ్ నగర్ అక్టోబర్ 15 విజన్ ఆంధ్ర ప్రతినిధి: ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో వాటిని ఎదుర్కొనేందుకు రూపొందించిన ముందస్తు, ప్రత్యామ్నాయ ప్రణాళికలపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రత్యేక అధికారి, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి. గౌతం సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ తాగునీటి సరఫరా, వ్యవసాయం, సాగునీరు, విద్యుత్ రంగాల్లో తలెత్తే సమస్యలను అధిగమించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, నీటిపారుదల, విద్యుత్, భూగర్భ జలాలు, ఉద్యానవన, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులతో ఎల్‌నినో ప్రభావాలు, పంటల పరిస్థితి, నీటి లభ్యత, విద్యుత్ సరఫరా, ముందస్తు కార్యాచరణ, ప్రత్యామ్నాయ ప్రణాళికలపై జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతం మాట్లాడుతూ.. వర్షాకాలం ముగింపు దశకు చేరుకుంటున్న నేపథ్యంలో ఇప్పటివరకు నమోదైన వర్షపాతం, ఖరీఫ్ సాగు విస్తీర్ణం, పంటల పరిస్థితి, భూగర్భ జలమట్టాలను సమీక్షించి, రానున్న అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలను చర్చించారు. రైతులు రబీ సీజన్‌కు సిద్ధమవుతున్నందున నీటి లభ్యత, సాగునీటి పరిస్థితులపై వాస్తవాలను వారికి వివరించాలని సూచించారు.

### వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు

వచ్చే వేసవిలో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా రూపొందించిన ప్రణాళికలను సమీక్షించారు. వ్యవసాయం, సాగునీటి అవసరాలకు అధికంగా నీటిని వినియోగిస్తే తాగునీటి సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, భవిష్యత్తు అవసరాలను అంచనా వేసి ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించాలని తెలిపారు.

### జూరాల, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలపై సమీక్ష

జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వలు, ఆయకట్టు పరిధిలో పంటల పరిస్థితి, సాగునీటి సరఫరాపై సమీక్షించారు. వారాబందీ పద్ధతిలో నీటిని విడుదల చేస్తున్నామని, వానాకాలం పంటలకు ఐదు తడుల నీరు అవసరమని, రానున్న రోజుల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, రబీ పంటలకు సాగునీరు అందించడం కష్టసాధ్యమని నీటిపారుదల శాఖ అధికారులు వివరించారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం (కేఎల్ఐఎస్) పరిధిలో మూడు పంపుల నిర్వహణ, విద్యుత్ సరఫరా పరిస్థితులను సమీక్షించారు. ఒక పంపునకు 24 గంటలు, మిగతా రెండు పంపులకు 18 గంటల చొప్పున విద్యుత్ సరఫరా జరుగుతోందని అధికారులు వివరించారు. పంపుల నిర్వహణకు అవసరమైన విద్యుత్ సరఫరాపై సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని గౌతం సూచించారు. జూరాల ఆయకట్టు పరిధిలో అక్రమంగా మోటార్ల ద్వారా నీటిని వినియోగించడాన్ని అరికట్టేందుకు రెవెన్యూ, నీటిపారుదల, పోలీసు శాఖలు సంయుక్తంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### విద్యుత్ పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై సమీక్ష

జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గడం, గృహ అవసరాలకు విద్యుత్ వినియోగం పెరగడం వల్ల విద్యుత్ గ్రిడ్‌పై ఏర్పడుతున్న ఒత్తిడిని సమీక్షించారు. విద్యుత్ పొదుపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు సమన్వయంతో పనిచేస్తూ తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

### నీటి సంరక్షణ పనులపై సమీక్ష

వీబీ-జీ రామ్ జీ పథకం కింద ఫామ్ పాండ్స్, సోక్ పిట్స్ తదితర నీటి సంరక్షణ పనుల పురోగతి, చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ పనుల ద్వారా భూగర్భ జలాల పెంపునకు తోడ్పడటంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి రోజులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొదటి దశలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించి, వాటిని త్వరగా పూర్తి చేయడంతో పాటు రెండో దశలో ఇళ్ల మంజూరుకు అవసరమైన చర్యలు చేపట్టాలని గౌతం సూచించారు. ప్రతి గ్రామంలో ఐదు నుంచి పది ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సిమెంట్ సరఫరా, ఇసుక లభ్యతపై సమీక్షించారు. లబ్ధిదారులకు కంపెనీల నుండి నేరుగా దసరా నుండి సబ్సిడీపై సిమెంట్ అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి స్వయం సహాయక సంఘాల ద్వారా లబ్ధిదారులకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనివల్ల నిర్మాణాలు త్వరగా పూర్తవడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు రూపొందించిన ముందస్తు, ప్రత్యామ్నాయ ప్రణాళికలను సమర్థంగా అమలు చేయాలని, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని గౌతం సూచించారు. ఈ సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, ఆదర్శ్ సురభి, సి. హెచ్. ప్రియాంక, షేక్ రిజ్వాన్ బాషా, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య లేకుండా స్థానిక నీటి వనరులను వినియోగించుకోవాలి

- రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి
- సీఎస్ సంజయ్ జాజు



సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 15 : ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా స్థానిక నీటి వనరులను గుర్తించి వాటిని వినియోగించుకుకోవాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు గురువారం ఆయన కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇరిగేషన్ అధికారులతో కలిసి సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూర్ ప్రాజెక్టు, భగీరత పథకం నీటి శుద్దికేంద్రం, చౌటకూర్ మండలంలోని సరాఫ్ పల్లి గ్రామంలో పత్తి పంటలను పరిశీలించి అధికారులతో. నీటి లభ్యత గురించి మిషన్ భగీరథ వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ లో



ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లడారు.... తాగునీటి సరఫరాకు అధికారులు ప్రత్యామ్నాయ మార్గలపై దృష్టి పెట్టి ప్రణాళికలు చేయాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న పంటలను కాపాడేందుకు వ్యవసాయ, విద్యుత్, నీటిపారుదల శాఖలు సమన్వయంతో కలిసి రైతులకు ఇబ్బంది లేకుండా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పెద్దారెడ్డిపేట మిషన్ భగీరథ ప్లాట్ ద్వార సరఫరా జరుగుతున్న సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ సింగూరు జలాశయంలో నీటిమట్టం, జిల్లాలో తాగునీటి లభ్యత, వర్షపాతం, పంటల సాగు పరిస్థితులు, తాగునీటి సరఫరాకు రూపొందించిన ప్రత్యామ్నాయ ప్రణాళికల గురించి వివరించారు. ప్రాజెక్ట్ నీటి నిల్వలు, భూగర్భ జలాలను బట్టి గ్రామాల వారీగా తాగునీటి అవసరాలను గుర్తించి, అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పటిష్టంగా అమలు చేయాలని అదేశించారు. రానున్న 20 రోజులు పంటల సంరక్షణ అత్యంత కీలకమైదని వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు.నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి, పంటలను సాగు చేయాలని, పశువులకు గ్రాసం కొరత తలెత్తకుండా వీబీజీ రామ్ జీ పథకం కింద నీటి సంరక్షణ పనులు చేపట్టాలని తెలిపారు. అనంతరం చౌటకూర్ మంటలంలోని సరాఫ్ పల్లి గ్రామంలో కౌలు రైతు గొల్ల మహేష్ ఏడు ఎకరాల్లో సాగు చేస్తున్న పత్తి పంటను సీఎస్ సంజయ్ జాజు అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ఆకుకూరలు, కూరగాయలను పండించడంతో పాటు కోళ్ల పెంపకం, గొర్రెల పెంపకం వంటి అనుబంధ రంగాల ద్వారా అదనపు ఆదాయం పొందేలా సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అఊచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, ఇరిగేషన్ డీఈఈ నాగరాజు. తహసీల్దార్ కృష్ణ, డిప్యూటి తాసీల్దార్ కిరణ్ కుమార్, తదితరులు ఉన్నారు.

# పిఏసిచైర్మన్ శ్రీ ఆరెక పూడి గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు వెల్లువ

- అంబరాన్నంటిన జన్మదిన సంబరాలు
- సర్వమత ప్రార్థనల తో జన్మదినం వేడుకలు




శేరిలింగంపల్లి .అక్టోబర్ 15: (విజన్ ఆంధ్ర) : పిఏసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ జన్మదినం సందర్భంగా వివేకానంద నగర్ లోని పిఏసి చైర్మన్ గాంధీ నివాసంలో జరిగిన జన్మదినం వేడుకలలో మర్యాదపూర్వకంగా కలిసి కేక్ కట్ చేసి , శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందచేసి జన్మదినం శుభాకాంక్షలు తెలియచేసిన మాదాపూర్ డివిజన్ సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ మరియు నాయకులు ,కార్యకర్తలు, అబిమానులు తదితరులు ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు, అభిమానులు, కాలనీల వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేటలో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు

- ఆడి పాడిన మహిళలు



సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 15 : పట్టణములో భారీ ఎత్తున్న బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు మహిళలు రకరకాల పూలతో అందమైన ఆకృతితో పోటీపడి అలంకరించిన వారి బతుకమ్మలను పట్టణంలోని జోగినాథ్ గంజిలో పెట్టి వేద బ్రాహ్మణులతో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం జోగుపేట పెద్ద చెరువు బతుకమ్మ ఘాటు వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేశారు ఈ బతుకమ్మలు తీసుకువచ్చానా మహిళా సోదరులకు మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి కౌన్సిలర్లు ప్రత్యేక ఆహ్వానం పలికారు ఈ యొక్క బతుకమ్మ నిమజ్జన కార్యక్రమానికి జోగిపేట పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ అనిల్ కుమార్ ఎస్సై గిరి శ్రీకాంత్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య కౌన్సిలర్లు కోరబోయిన నాగరాజ్, అరుణ్, రాజాశేఖర్, అల్లే శ్రీకాంత్,తోట్ల రామకృష్ణపట్లోళ్ల ప్రవీణ్, శ్రీనివాస్, అనిల్, నాయకులు గుర్రం కృష్ణ, ఆత్మ కమిటీ సభ్యులు చిట్యాల మధు, ఖలేద్,సీనియర్ నాయకులు సురోత్తం రెడ్డి, సార శివకుమార్, శరత్ బాబు, తుపాకుల సునీల్, తుడుము మురళి, ఆకుల నందు మరియు పెద్దయెత్తున మహిళలు పాల్గొన్నారు

# ప్రాజెక్టు పేరుతో రైతులను మోసం చేసింది బీఆర్ఎస్

- ఎమ్మెల్యే మేఘారెడ్డి









వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర) : ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో రైతులను మోసం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విమర్శించారు. ఏదుల ప్రాజెక్టు కోసం 2500 ఎకరాలు ఇచ్చిన రైతులకు రూ.25 లక్షల పరిహారం ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం రేవల్లి, ఏదుల మండలాల్లోని బండరావిపాకుల, కొంకలపల్లి, ఏదుల గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారం కోల్పోయాక మరో మాట మాట్లాడటం బీఆర్ఎస్ నాయకుల నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. బుద్ధారం గ్రామంలో ధర్నాలు చేస్తూ నీతులు చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రజలు నాయకుల మాటలనే కాకుండా గతంలో చేసిన పనులను కూడా పరిశీలించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏదుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ తీసుకున్నామన్నారు. ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాల నూతన భవనాలు, 10 వేల మెట్రిక్ టన్నుల గోదాము, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. త్వరలో మండలానికి కేజీబీవీ, ఎస్సీ, బీసీ హాస్టళ్లు, జూనియర్ కళాశాల, వ్యవసాయ కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఏదులలో 400 ఎకరాలతో పాటు అనంతపురం సాగుభూములకు నీరందించేందుకు మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పరిశీలిస్తామన్నారు. రేవల్లి మండలం కొంకలపల్లిలో 5 వేల మెట్రిక్ టన్నుల గోదాము, బండరావిపాకులలో ఆంజనేయస్వామి ఆలయం, పాఠశాల ప్రహరీ గోడకు శంకుస్థాపన చేశారు.అనంతరం వనపర్తి పీజీ కళాశాల బాలుర, బాలికల వసతి గృహాల నిర్మాణానికి భూమిపూజ చేశారు.కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర ) :మండల తహసిల్దార్ కార్యాలయాలలోని పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తహసిల్దార్,సిబ్బందితో పలు రెవెన్యూ అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. 2026 లో భాగంగా దావాలు, అభ్యంతరాల పరిష్కరణ వేగవంతం చేయాలని తెలిపారు. కార్యాలయానికి సంబంధించిన పెండింగ్ సర్టిఫికెట్లు,భూ భారతి ద్వారా అందిన దరఖాస్తులు జి.ఓ.ఎం.ఎస్.నం.59,భూదాన్ భూములకు సంబంధించిన అంశాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత కాల పరిమితిలోగా వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు ధృవీకరణ పత్రాల కోసం నిరీక్షించకుండా పెండింగ్ సర్టిఫికెట్ల మంజూరుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు.అనంతరం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం,కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే,సూపరింటెండెంట్లు, సంబంధిత సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఫైళ్ల పురోగతిపై విభాగాల వారీగా సమీక్షించారు.ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఫైలును గడువులోగా పరిష్కరించాలని, కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు ఇబ్బందులు కలగకుండా వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలని తెలిపారు. కార్యాలయ ఫైల్స్, రికార్డులను పక్కాగా నిర్వహించాలని, రికార్డుల భద్రత,నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రతి విభాగం సమర్థవంతంగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మారుమూల గిరిజన పల్లెలకూ మిషన్ భగీరథ జలాలు

**- అమ్రాబాద్ తండాను సందర్శించిన కలెక్టర్**

**- రక్షిత మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం**



నిజామాబాద్, అక్టోబర్ 15 :( విజన్ ఆంధ్ర) మామూముల గిరిజన ప్రాంతాలకు సైతం మిషన్ భగిరథ ద్వారా రక్షిత మంచినీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మోపాల్ మండలం అమ్రాబాద్ తండాను కలెక్టర్ గురువారం సందర్శించారు. మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణంలో పలు తండాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉండడంతో ఇదివరకు అమ్రాబాద్ తండా సహా సుమారు 11 నివాస ప్రాంతాలకు మిషన్ భగీరథ పైప్ లైన్లు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రస్తుతం ఆ ప్రాంతాలకు మిషన్ భగీరథ జలాలు అందించేందుకు వీలుగా అనువైన పరిస్థితులను పరిశీలించేందుకు కలెక్టర్ క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. తాగునీటి అవసరాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పూర్తిగా బోరుబావుల పైనే ఆధారపడి జీవనాలు వెళ్ళదీస్తున్నామని ఈ సందర్భంగా స్థానిక గిరిజనులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని నివాస ప్రాంతాలకు రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా అనుకూలమైన ప్రదేశంలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించాలని సూచించారు. నిర్దేశిత ప్రాంతాలకు తాగునీటి సరఫరాను అందుబాటులోకి తెచ్చి జల్ జీవన్ మిషన్ కింద కవర్ అయ్యేలా చూడాలన్నారు. కాగా, ఎల్ నినో ప్రభావం వల్ల ఆశించిన రీతిలో వర్షాలు కురియక నీటి నిల్వలు అంతంతమాత్రంగానే అందుబాటులో ఉన్నాయని, భూగర్భ జలమట్టం సైతం దిగువకు పడిపోయినందున ఖరీఫ్ లో ఆరుతడి పంటలే సాగు చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా స్థానిక రైతులకు సూచించారు. వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పప్పుదినుసులు, మొక్కజొన్న, జొన్న వంటి పంటలను సాగు చేయాలని హితవు పలికారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రాజేంద్రకుమార్, మిషన్ భగీరథ ఈ.ఈ రాకేష్, మోపాల్ తహసిల్దార్ రేఖ, స్థానిక సర్పంచ్ ప్రియాంక తదితరులు ఉన్నారు.

## పేద రోగికి రూ.1.10 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

**- ఎమ్మెల్యే వివేకానంద్ చొరవతో ఎల్ఓసీ మంజూరు**

**- బాధిత కుటుంబానికి అందజేసిన బీఆర్ఎస్ నాయకులు**



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర): బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 1.10 లక్షల విలువైన ఎల్ఓసీని కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన జి. ఎల్లయ్య (53) కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పేదలకు వైద్యసాయం అందేలా చొరవ తీసుకున్న ఎమ్మెల్యే వివేకానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంపత్ మాధవ రెడ్డి, కుంట సిద్ధి రాములు, సమ్మయ్య నేత, కాలె నగేష్, ఆటో బలరాం, గణేష్, జయంచారి, చంద్రశేఖర్ రెడ్డి, బాలమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి ఉన్నతికి ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్ జిల్లా,అక్టోబర్ 15,(విజన్ ఆంధ్ర); ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి విద్యాపరంగా ఉన్నత స్థాయికి చేరుకునేలా ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖపై నిర్వహించిన సుదీర్ఘ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు, విద్యార్థుల క్రమం తప్పని హాజరుతోనే ప్రభుత్వ విద్యావ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం, అవగాహన సామర్థ్యాలను పెంపొందించేలా బోధన కొనసాగించాలని సూచించారు. తరచూ పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకోవాలని, వారు క్రమం తప్పకుండా




పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోర్డు పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్ణీత గడువులోగా సిలబస్‌ను పూర్తి చేసి, ప్రతి సబ్జెక్టును విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే విధంగా బోధించాలని అన్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ, పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజూ నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందేలా పర్యవేక్షించాలని తెలిపారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల కోసం 'అభ్యాస దీపిక' వెబ్‌సైట్ రూపకల్పనపై ప్రధానోపాధ్యాయుడికి అభినందన. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం 'అభ్యాస దీపిక' వెబ్‌సైట్‌ను రూపొందించిన ప్రధానోపాధ్యాయుడు మునిందర్ రాజును జిల్లా కలెక్టర్ అభినందించారు. గణితం తదితర సబ్జెక్టులను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా పాఠాలు, మెళకువలు, అభ్యాస విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక చొరవతో వెబ్‌సైట్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడే ఇలాంటి వినూత్న ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత కార్యక్రమాలను మరింత మంది ఉపాధ్యాయులు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాట్నా ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ టోర్నీలో మ్యాచ్ పాయింట్ క్రీడాకారిణుల సత్తా!

**- అండర్ -13 విభాగంలో మెరిసిన చిన్నారులు..**

**సింగిల్స్, డబుల్స్‌లో మెయిన్ డ్రాకు అర్హత**

**- భవనాసి సాన్వి, దేవరం శ్రీనిధి, లట్టాల సాన్వి ప్రతిభకు ప్రశంసలు**

హైదరాబాద్ అక్టోబర్ 15 ( విజన్ ఆంధ్ర ప్రతినిది) : జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారిణులు అద్భుత ప్రతిభ కనబరిచారు. బీహార్‌లోని పాట్నాలో అక్టోబర్ 10 నుంచి 15 వరకు నిర్వహించిన అండర్--13 ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో భవనాసి సాన్వి, దేవరం శ్రీనిధి, లట్టాల సాన్వి సత్తా చాటారు. బాలికల డబుల్స్ విభాగంలో భవనాసి సాన్వి, దేవరం శ్రీనిధి జోడీ మెయిన్ డ్రాకు అర్హత సాధించగా, లట్టాల సాన్వి సింగిల్స్‌తో పాటు డబుల్స్ విభాగంలోనూ మెయిన్ డ్రాలో స్థానం సంపాదించి ప్రత్యేక గుర్తింపు పొందింది.ఉత్కంఠభరిత పోరులో సాన్వి, శ్రీనిధి విజయంబాలికల డబుల్స్ విభాగంలో మ్యాచ్ పాయింట్ అకాడమీకి చెందిన భవనాసి సాన్వి, దేవరం శ్రీనిధి జోడీ అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించింది. ఏ-జోన్ అకాడమీకి చెందిన పెన్నేరు మన్విత, గోపీచంద్ అకాడమీకి చెందిన కన్విక వంకదారు జోడీతో జరిగిన పోటీలో మ్యాచ్ పాయింట్ క్రీడాకారిణులు చివరి వరకు పోరాడి విజయాన్ని అందుకున్నారు.తొలి సెట్‌లో 15--11తో ఆధిక్యం సాధించిన సాన్వి, శ్రీనిధి జోడీ రెండో సెట్‌లో 7--15తో ఓటమి పాలైంది. దీంతో మ్యాచ్ నిర్ణయాత్మక మూడో సెట్‌కు చేరింది. కీలకమైన మూడో సెట్‌లో ఒత్తిడిని అధిగమిస్తూ సమన్వయంతో ఆడిన ఈ జోడీ 15--13తో విజయం సాధించింది. ఈ విజయంతో మెయిన్ డ్రాకు అర్హత సాధించి తమ ప్రతిభనునిరూపించుకుంది. సింగిల్స్, డబుల్స్‌లో లట్టాల సాన్వి దూకుడుఇదే టోర్నమెంట్‌లో మ్యాచ్ పాయింట్ అకాడమీ క్రీడాకారిణి లట్టాల సాన్వి సైతం విశేష ప్రతిభ కనబరిచింది. బాలికల సింగిల్స్ విభాగంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన అహోనా బెనర్జీతో జరిగిన మ్యాచ్‌లో 15--7, 15--8తో వరుస సెట్లలో విజయం సాధించింది. ప్రత్యర్థికిఏమాత్రంఅవకాశంఇవ్వకుండాఆత్మవిశ్వాసంతో ఆడిన సాన్వి మెయిన్ డ్రాకు అర్హత సాధించింది. డబుల్స్ విభాగంలో టాప్ సీడ్‌గా ఉండటంతో ఆమె నేరుగా మెయిన్ డ్రాలో స్థానం సంపాదించింది.






దీంతో ఈ టోర్నమెంట్‌లో సింగిల్స్, డబుల్స్ రెండు విభాగాల్లోనూ పోటీపడే అవకాశాన్ని దక్కించుకుంది. చిన్న వయసులోనే జాతీయ స్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో రెండు విభాగాల్లోనూ అర్హత సాధించడం విశేషం.క్రీడాకారిణుల విజయాలపై అకాడమీ హర్షం జాతీయ స్థాయి పోటీల్లో మ్యాచ్ పాయింట్బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారిణులు సాధించిన విజయాలు అకాడమీకి గర్వకారణంగా నిలిచాయి. చిన్న వయసులోనే కఠినమైన పోటీల్లో పాల్గొంటూ తమ నైపుణ్యాన్ని, పట్టుదలను చాటుకోవడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ విజయాలపై మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకులు, చైర్మన్, ప్రధాన కోచ్ వేణు ముప్పాల సంతోషం వ్యక్తం చేశారు. క్రీడాకారిణులు భవిష్యత్తులో మరింత కష్టపడి సాధన చేస్తూ జాతీయ స్థాయిలో ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల పట్ల ఆసక్తి కలిగిన చిన్నారులను ప్రోత్సహిస్తూ, వారికి మెరుగైన శిక్షణ అందించడం ద్వారా భవిష్యత్తులో మరింత మంది ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## మార్నింగ్ వాక్ లో సమస్యలు తెలుసుకున్న సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్



వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా పెద్దమండడి మండలం మనిగిల్ల గ్రామంలో గురువారం మార్నింగ్ వాక్ లో భాగంగా గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ 3, 4 వ వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వార్డుల్లో డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాలు పనితీరు, మున్సిపాలిటీ సిబ్బంది పనితీరుపై ప్రజలను ఆరా తీశారు. త్వరలోనే కొత్త డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అవసరమున్న చోట కంప చెట్లను రేపటి నుండి తొలగిస్తామని తెలిపారు.సమస్య చిన్నదైనా పెద్దదైనా ప్రతినిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి అవసరాలను తీరుస్తామని సర్పంచ్ పేర్కొన్నారు.కార్యక్రమంలో వార్డు సభ్యుడు జాజలి గణేష్, నాగరాజు, బోయ నారాయణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### బాసర మూల నక్షత్ర మహోత్సవానికి పటిష్ట బందోబస్తు

**- జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల**



బాసర : అక్టోబర్ 15: విజన్ ఆంధ్ర : బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో నేడు జరగనున్న మూల నక్షత్రం, మహా అక్షరాభ్యాస కార్యక్రమానికి 200 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెలిపారు.ఆలయ పరిసరాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, గోదావరి స్నాన ఘట్టాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.బాసరలో పోలీసు సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో విధులపై దిశానిర్దేశం చేశారు. భక్తులు పోలీసుల సూచనలు పాటించాలని, చిన్నారుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, నది ప్రవాహ ఉధృతి ఉన్న ప్రాంతాలకు వెళ్లకూడదని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, సిఐలు ఎస్సైలుఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువులకు మురుగునీటి ముప్పు!

**- శిథిలావస్థలో వాటర్ ట్యాంక్.. ప్రజలకు ప్రమాద ఘంటికలు!**

**- దూలపల్లిలో సుమర్ చెరువు, లింగోయ్ కుంట కలుషితం**

**- మురుగునీటి ప్రవాహాన్ని అరికట్టి జలవనరులను కాపాడాలి**

**- ప్రగతినగర్ సాయి కీర్తి లేఔట్‌లో పాత ట్యాంక్ తొలగించాలి**



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ప్రజలతో కలిసి ఆకుల సతీష్ ఫిర్యాదు

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర); ఒకవైపు చెరువుల్లోకి చేరుతున్న మురుగునీటితో జలవనరులు కలుషితమవుతుండగా.. మరోవైపు శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్ స్థానికుల భద్రతపై ఆందోళన కలిగిస్తోంది. ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతూ బీజేపీ నాయకుడు ఆకుల సతీష్ స్థానికులతో కలిసి హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. దూలపల్లిలోని చెరువుల పరిరక్షణ, ప్రగతినగర్‌లో ప్రమాదకరంగా మారిన వాటర్ ట్యాంక్ తొలగింపుపై ఆధారాలతో వినతిపత్రం అందజేశారు.

***మురుగునీటితో చెరువుల కలుషితం***

కొంపల్లి సర్కిల్ పరిధిలోని దూలపల్లిలో ఉన్న సుమర్ చెరువు, లింగోయ్ కుంటల్లోకి సమీప విద్యాసంస్థల నుంచి మురుగునీరు చేరుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో చెరువుల నీరు కలుషితమవుతోందని, ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే దృష్టి సారించాలని కోరారు. చెరువుల్లోకి మురుగునీరు చేరకుండా



శాశ్వత చర్యలు చేపట్టడంతోపాటు, ఇప్పటికే కలుషితమైన జలవనరులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. చెరువుల పరిసరాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించి, భవిష్యత్తులో ఆక్రమణలు జరగకుండా పటిష్ఠమైన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

***30 ఏళ్ల నాటి ట్యాంక్‌తో ముప్పు!***

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతినగర్ సాయి కీర్తి లేఔట్‌లో సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ ప్రస్తుతం నిరుపయోగంగా ఉందని, దానికి పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారిందని ఫిర్యాదులో వివరించారు. ట్యాంక్ శిథిలావస్థపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, ప్రజలకు ప్రమాదం వాటిల్లకముందే తగిన చర్యలు చేపట్టాలని కోరారు. అవసరమైన సాంకేతిక పరిశీలన అనంతరం ట్యాంక్‌ను తొలగించి, అక్కడి పార్కును ప్రజలు, చిన్నారులు సురక్షితంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

***క్షేత్రస్థాయి నివేదికలపై చర్యలు***

రెండు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆకుల సతీష్ తెలిపారు. ఫిర్యాదులపై స్పందించిన కమిషనర్ ఏ.వి. రంగనాథ్ క్షేత్రస్థాయి నివేదికలు తెప్పించుకుని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చెరువుల పరిరక్షణ, ప్రజల భద్రత విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల సతీష్‌తో పాటు రామకృష్ణ రెడ్డి, అశ్విన్, ఆర్‌కే భీమ్‌రావు, వెంకట్రావు, వీర రెడ్డి, నూఖా రాజు, ఈశ్వర రెడ్డి, సాయినాథ్ రెడ్డి, రాజా రెడ్డి, దుర్గా, గుర్రాల రమేష్, చింతల నరసింహ, దుర్గం చంద్రశేఖర్, పీఆర్ సాయిరాం, గరిష్ అశ్విన్, జి. చుక్కయ్య, పూజారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీ చైర్మన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బలరాం యాదవ్

శేరిలింగంపల్లి .అక్టోబర్ 15 :( విజన్ ఆంధ్ర) : ప్రియతమ నాయకులు, పిఏసి చైర్మన్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కి జన్మదిన సందర్భంగా, వారిని కలిసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి అలాగే కొండాపూర్ గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ లో పండ్లు మరియు బ్రెడ్లు పంపిణీ చేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు అభిమానులు ఈ కార్యక్రమంలో రాజమోహన్రావు నాగరాజు రేపల్లె అశోక్ సన్నీ యాదవ్





మాధవ్ వెంకటయ్య ప్రేమ్ సాయి చరణ్ మల్లికార్జున్ రవితేజ తరుణ్ తదితరులు పాల్గొన్నారు

# రహదారి స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్.. నిబంధనలు ఏమంటున్నాయి?

**- సుభాష్‌నగర్ గంపల బస్తీలో నిర్మాణంపై స్థానికుడి ఫిర్యాదు**

**- మసీదు సమీపంలో రహదారి స్థల వినియోగంపై అభ్యంతరం**

**- అనుమతులు, విద్యుత్ భద్రతా ప్రమాణాలపై విచారణకు విజ్ఞప్తి**

**- క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్**



కుత్బుల్లాపూర్, విజన్ ఆంధ్ర: ప్రజల రాకపోకలకు ఉపయోగపడాల్సిన రహదారి స్థలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారంటూ సుభాష్‌నగర్ గంపల బస్తీలో ఫిర్యాదు అందింది. మహమ్మదీయ మసీదు సమీపంలో చేపడుతున్న నిర్మాణంపై స్థానికుడు మహమ్మద్ గౌస్ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థల వివరాలు, నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భద్రతా ప్రమాణాలను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

***రహదారికి అడ్డంకిగా మారుతుందా?***

గంపల బస్తీలో మసీదు సమీపంలో చేపడుతున్న ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఫిర్యాదుదారుడు ఆందోళన వ్యక్తం చేశారు. వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

***అనుమతులపై స్పష్టత ఏదీ?***

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిర్మాణం చేపడుతున్న స్థలం రహదారికి సంబంధించినదేనా? విద్యుత్ భద్రతా నిబంధనలను పాటిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని మహమ్మద్ గౌస్ కోరారు. సంబంధిత స్థల రికార్డులు, అనుమతి పత్రాలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు.






***అధికారులకు ఫిర్యాదు.. చర్యలపై ఎదురుచూపులు***

ఈ వ్యవహారంపై సంబంధిత సహాయ ఇంజినీర్‌కు ఫిర్యాదు పత్రంతోపాటు నిర్మాణానికి సంబంధించిన చిత్రాలను అందించినట్లు ఫిర్యాదుదారుడు తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

***ప్రజా భద్రతకు ప్రాధాన్యమివ్వాలి***

రహదారి స్థల వినియోగం, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, విద్యుత్ భద్రతకు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖలు సమన్వయంతో విచారణ జరపాల్సిన అవసరం ఉంది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, భద్రతకు ముప్పు వాటిల్లకుండా అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఫిర్యాదుపై అధికారులు తీసుకునే చర్యలపై ఆసక్తి నెలకొంది.

## శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



శేరిలింగంపల్లి .అక్టోబర్ 15: (విజన్ ఆంధ్ర) : శేరిలింగంపల్లి జోనల్ ఆఫీస్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, xూూ ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగం మరియు అర్బన్ బయోడైవర్సిటీ ( విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో పలు విభాగాలు పాల్గొన్న ఈ సంబరాలలో



జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, xూూ తో పాటు యూసీడీ, యూబీడీ విభాగాల అధికారులు, మహిళా ఉద్యోగులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అమర్చి, సాంప్రదాయ బతుకమ్మ పాటలతో జోనల్ కార్యాలయ ప్రాంగణంలో కోలాహలం సృష్టించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా సాగిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# ప్రకృతి ఆరాధనకు ప్రతీక బతుకమ్మ

- సంక్షేమ అధికారి సుధారాణి











వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర) : ప్రకృతిపై తెలంగాణ ప్రజలకున్న ఆరాధనా భావానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుధారాణి అన్నారు. గురువారం వనపర్తి ఐడీఓసీ ప్రాంగణంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేసి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయ పాటలు పాడుతూ జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని చాటుతుందన్నారు. బతుకమ్మ వేడుకలు మహిళల మధ్య ఐక్యతను, ఆత్మీయతను పెంపొందిస్తాయని, పండుగలను సమిష్టిగా జరుపుకోవడం వల్ల సామాజిక ఐక్యత పెరుగుతుందన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, అంగన్ వాడీ కార్యకర్తలు ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలతో ఐడీఓసీ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాం, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబరాలలో మహిళా గెజిటెడ్ అధికారుల కోలాటం..



రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 15, ( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పిన బతుకమ్మ సంబరాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళా ఉద్యోగులు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని తెలంగాణ రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను గురువారము ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డి గెజిటెడ్ అధికారుల సంఘం మహిళా విభాగం చైర్మన్ రేవతి నాయకత్వంలో, శ్రీమతి శాంతి శ్రీ, సైదమ్మ, అనిత , ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3.00 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ బతుకమ్మ పాటలు, మహిళల సందడి, సమష్టి భాగస్వామ్యంతో టీజీవో భవన్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. మహిళా ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను కొలుస్తూ, పాటలు పాడుతూ ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో పాలుపంచుకుంటూ, రంగారెడ్డి జిల్లా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచటంలో అందరూ భాగస్వామ్యమై తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలుపుతుందన్నారని ఆమే కొనియాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగుల మధ్య ఐక్యతను, ఆత్మీయతను మరింత బలోపేతం చేస్తాయని వారు పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వానికి, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల జీవన సంస్కృతిలో విడదీయలేని భాగంగా కొనసాగుతోందని, మహిళలు ఐక్యంగా పాల్గొని సంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మ సంబరాలను జరుపుకోవడం తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పావని, జ్యోత్స్న, వినీత , కవిత, శాంతిరేఖ, రోజా, హెప్సిబా, ఉదయ , స్వాతి, శైలజ, ప్రవంతి, అనిత, విజయ శ్రీ, పాల్గొన్నారు.

# సిఎంఆర్ డెలివరీ సకాలంలో పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



మంచిర్యాల (ప్రతినిధి)అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర ) జిల్లాలోని రైస్ మిల్లుల యజమానులు సిఎంఆర్ డెలివరీ సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు.గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వేణుగోపాల్,పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి సిఎంఆర్ డెలివరీ పై అధికారులు,రైస్ మిల్లుల యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యం డెలివరీలలో వెనుకబడిన మిల్లులు తమ పని తీరును మెరుగుపరుచుకొని,బియ్యం అప్పగింతలను వేగవంతం చేయాలని తెలిపారు.కొన్ని మిల్లులు నిర్దేశిత లక్ష్యాల సాధనలో జాప్యం చేస్తున్నాయని,పెండింగ్ లో ఉన్న సిఎంఆర్ బియ్యం డెలివరీలను తక్షణమే వేగవంతం చేసి ప్రభుత్వం నిర్దేశించిన కార్యాచరణ ప్రకారం గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు.సిఎంఆర్ బియ్యం లక్ష్యాల సాధనలో ఆలస్యం జరగకుండా మిల్లర్లు తగిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.ఈ సమావేశంలో రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ పుట్టినిల్లుపై

# చారిత్రక చర్చ..

## వేములవాడతో విడదీయలేని అనుబంధం!





### రాజన్న క్షేత్రం నుంచి తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవం వరకు.. పూల పండుగ వెనుక ఆసక్తికరమైన గాథ

*ప్రత్యేక కథనం । వేములవాడ, అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర బ్యూరో) CH.దేవరాజ్*

**తెలంగాణ సంస్కృతికి ప్రతీక.. ఆడబిడ్డల ఆత్మీయతకు చిరునామా.. ప్రకృతిని ఆరాధించే అపురూపమైన పండుగ బతుకమ్మ. రంగురంగుల పూలను పేర్చి, గౌరమ్మను కొలుస్తూ మహిళలు పాడే పాటలు, ఆడే ఆటలు తెలంగాణ పల్లె సంస్కృతికి అద్దం పడతాయి. అయితే ఈ పూల పండుగ పుట్టుక వెనుక వేములవాడ రాజన్న క్షేత్రానికి సంబంధం ఉందనే కథనం ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తోంది. సుమారు వెయ్యేళ్ల చారిత్రక నేపథ్యంతో ముడిపడిన ఈ గాథ బతుకమ్మ మూలాలపై మరోసారి చర్చకు తెరలేపుతోంది.**

#### చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం.. వేములవాడ రాజన్న క్షేత్రం

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడకు తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది. క్రీ.శ. 8వ నుంచి 10వ శతాబ్దాల మధ్య వేములవాడ చాళుక్యుల పాలనలో ఒక ప్రముఖ రాజకీయ, సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లింది. రాజరాజేశ్వరస్వామి ఆలయం ఈ ప్రాంత ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. శతాబ్దాల చరిత్ర, ఆలయ సంప్రదాయాలు, స్థానిక జానపద గేయాలు ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. ఈ చారిత్రక నేపథ్యంతోనే బతుకమ్మ పుట్టుకకు వేములవాడతో సంబంధం ఉందనే స్థానిక కథనం ప్రాచుర్యంలో ఉంది. అయితే బతుకమ్మ ఇక్కడే పుట్టిందని నిర్ధారించే ప్రత్యక్ష శాసన ఆధారాలు ఇప్పటివరకు స్పష్టంగా స్థాపించబడలేదు. ఈ కథనంలోని చారిత్రక అంశాలను పరిశోధన ద్వారా నిర్ధారించాల్సిన అవసరం ఉంది.

#### శివుడి వియోగం.. బతుకమ్మ ఆవిర్భావంపై ప్రచారంలో ఉన్న గాథ

ప్రచారంలో ఉన్న ఒక కథనం ప్రకారం, వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రానికి సంబంధించిన శివలింగాన్ని చోళు





లు తమ ప్రాంతానికి తరలించారనే విశ్వాసం ఉంది. తంజావూరులోని బృహదీశ్వర ఆలయంతో ఈ కథను అనుసంధానిస్తారు. ఈ ఘటనను శివుడు, పార్వతీదేవి వియోగానికి ప్రతీకగా భావిస్తూ, అమ్మవారిని పూలతో కొలిచే సంప్రదాయం ఏర్పడిందని జానపద గాథ వివరిస్తుంది. పూలను అందంగా పేర్చి గౌరీదేవిని ఆరాధించడం, మహిళలు సమూహాలుగా చేరి పాటలు పాడటం, వలయాకారంలో తిరుగుతూ ఆటలాడటం క్రమంగా బతుకమ్మ సంప్రదాయంగా రూపుదిద్దుకుందని ఈ కథనం చెబుతోంది. ఈ గాథకు సంబంధించిన ప్రతి అంశానికి చారిత్రక నిర్ధారణ అవసరమైనప్పటికీ, వేములవాడకు బతుకమ్మతో ఉన్న సంబంధాన్ని వివరించే స్థానిక సంప్రదాయ కథనంగా దీనికి ప్రాధాన్యం ఉంది.

#### పూల పండుగ కాదు.. తెలంగాణ జీవన సంస్కృతి!

బతుకమ్మ అంటే పూలను పేర్చడం, నీటిలో నిమజ్జనం చేయడం మాత్రమే కాదు. ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే పండుగ. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి కాలానుగుణ పూలతో బతుకమ్మను అలంకరించి, గౌరమ్మను పూజించడం ఈ పండుగలో ప్రధాన భాగం. బతుకమ్మ పాటల్లో అమ్మవారి మహిమతో పాటు పుట్టింటి అనుబంధాలు, అక్కాచెల్లెళ్ల ఆత్మీయత, కుటుంబ బంధాలు, గ్రామీణ జీవితంలోని సంతోషాలు, కష్టాలు ప్రతిధ్వనిస్తాయి. తరతరాలుగా మహిళలు మౌఖికంగా అందించిన ఈ పాటలు తెలంగాణ సామాజిక, సాంస్కృతిక చరిత్రకు విలువైన సంపదగా నిలుస్తున్నాయి. ప్రాంతాలవారీగా బతుకమ్మ ఆచారాల్లో కొన్ని తేడాలు కనిపించినప్పటికీ, ప్రకృతిని పూజించడం, మహిళల ఐక్యతను చాటడం, కుటుంబాలు-గ్రామాల మధ్య అనుబంధాలను బలోపేతం చేయడం ఈ పండుగలోని ప్రధాన లక్షణాలు.

#### వేములవాడకు రావాల్సిన ప్రత్యేక గుర్తింపు

బతుకమ్మ పుట్టుకతో వేములవాడకు ఉన్న సంబంధంపై ప్రచారంలో ఉన్న కథనాన్ని మరింత లోతుగా పరిశోధించాల్సిన అవసరం ఉంది. స్థానిక జానపద గేయాల సేకరణ, పురాతన గ్రంథాల పరిశీలన, ఆలయ చరిత్ర అధ్యయనం, చరిత్రకారులు-పురావస్తు నిపుణుల పరిశోధన ద్వారా ఈ గాథ వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీయవచ్చు. బతుకమ్మ పుట్టుకకు సంబంధించిన ఆధారాలు లభిస్తే వేములవాడ చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యానికి మరింత గుర్తింపు లభించే అవకాశం ఉంది. ఈ దిశగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ, పర్యాటక శాఖ, విశ్వవిద్యాలయాలు, పరిశోధకులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



# అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

## అనధికార నిర్మాణాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 15 (విజన్ ఆంధ్ర ):బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని,మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అనధికార నిర్మాణాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలోని 17,18 వార్డులను ఆకస్మికంగా సందర్శించి ఆయా వార్డులలో జరుగుతున్న అభివృద్ధి పనులు,నిర్మాణ కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలోని 18వ వార్డులో సుమారు 20 లక్షల రూపాయల వ్యయంతో సి.సి.రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, నిర్మాణంలో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు,సాంకేతిక మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని,నిర్మాణ పనుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. 17వ వార్డులో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాన్ని పరిశీలించి, మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేపట్టడం విరుద్ధమని,సదరు నిర్మాణానికి సంబంధించి పూర్తి వివరాలను పరిశీలించి,తక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అవసరమైన చట్టపరమైన ప్రక్రియను అనుసరించి అనధికార నిర్మాణాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనధికార నిర్మాణానికి ఇంటి నంబరు కేటాయించి,సంబంధిత వివరాలను ఆన్‌లైన్ వ్యవస్థలో నమోదు చేయడంలో సంబంధిత దరఖాస్తులు,అనుమతులు, ఇతర మున్సిపల్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపు జరిగినట్లు నిర్ధారణ అయితే అట్టి ఇంటి నంబరు వివరాలను నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ వ్యవస్థ నుంచి తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో అనధికార నిర్మాణాలకు ఇంటి నంబర్లు కేటాయించడం,వాటికి సంబంధించిన వివరాలను మున్సిపల్ రికార్డులలో నమోదు చేయడం వంటి అంశాలలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.అధికారులు,సిబ్బంది తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రణాళిక అమలుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని,అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని తెలిపారు. పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు క్రమబద్ధమైన పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని,ప్రజలకు నాణ్యమైన రహదారులు,మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.అనంతరం మండల కేంద్రంలోని 86,87,88,89 పోలింగ్ కేంద్రాలలో కొనసాగుతున్న ప్రత్యేక శిబిరాలను సందర్శించారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా దావా,అభ్యంతరాల విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.బెల్లంపల్లి ఈఆర్ఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు.ఓటరు జాబితా సమగ్ర సవరణలో అర్హత కలిగిన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో ఉండాలని,అనర్హుల వివరాలు ఉండకూడదని,ఆ దిశగా స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్, వైస్ చైర్మన్,అసిస్టెంట్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.